ప్రతిపక్షం

www.prathipaksham.in



షేన్ వార్న్ కుటుంబానికి రూ. 460 కోట్లు 10

గురువారం 26.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 6 పేజీలు: 10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

మా షరతులు, డిమాండ్లు నెరవేర్చండి

- యుద్ధం ముగించడానికి ఇరాన్ షరతులు
- యుద్ధ నష్టాలకు తగిన పరిహారం చెల్లించాలి
- ఇరాన్‌కు ట్రంప్ 15 పాయింట్ల సీజ్‌ఫైర్ ప్రతిపాదన
- అమెరికా నౌక అబ్రహం లింకన్ పై ఇరాన్ దాడి
- సముద్ర జలాలపై సార్వభౌమాధికారాన్ని చాటుకునేందుకే: ఇరాన్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

అమెరికా చేసిన శాంతి ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. యుద్ధ విరమణ అనేది ఇరాన్ సొంత నిబంధనలు, కాలపరిమితి మేరకే జరుగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన సీనియర్ భద్రతాధికారి బుధవారం ప్రభుత్వ వార్తా సంస్థ ప్రెస్‌టీవీకి తెలిపారు. "మేము నిర్ణయించుకున్నప్పుడు, మా షరతులు, డిమాండ్లు నెరవేరినప్పుడు మాత్రమే యుద్ధాన్ని ముగిస్తాం. అప్పటి వరకు శత్రువులపై దెబ్బకొట్టాలన్న తమ సంకల్పం అలానే కొనసాగుతుంది" అని సదరు ఇరాన్ భద్రతాధికారి పేర్కొన్నారు. 'వాషింగ్టన్ వివిధ దౌత్య మార్గాల ద్వారా చర్చలు జరుపుతోంది. అయితే అది అతిశయోక్తిగా ఉంది. యుద్ధరంగంలో అమెరికా వైఫల్యం చెందిందనే వాస్తవాన్ని దాచిపెట్టి, సంబంధం లేని ప్రతిపాదనలు అది ముందుకు తెస్తోంది' అని పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించాలంటే, ఇరాన్ విధించే ఐదు నిర్దిష్ట షరతులను అంగీకరించాల్సి ఉందని స్పష్టం చేసింది. శత్రువులు చేసే దురాక్రమణను, హత్యలను పూర్తిగా నిలిపివేయాలని, ఇస్లామిక్ రిపబ్లిక్‌పై యుద్ధాన్ని తిరిగి రుద్దకుండా చూసేందుకు పటిష్టమైన యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని, యుద్ధ నష్టాలకు తగిన పరిహారం చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని, అన్ని విధాలుగా, అన్ని రంగాల్లో, అన్ని ప్రతిఘటన బృందాల విషయంలో యుద్ధాన్ని ముగించాలని, హర్మూజ్ జలసంధిపై ఇరాన్ సార్వభౌమ హక్కుకు సంబంధించి

...:: మిగతా 2లో



కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి రాజీనామా

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ

"నేను ఎంత సంయమనం పాటించాలి. నా బాధ ఎవరికి చెప్పుకోవాలి. పదవుల కోసం తాపత్రయం పడలేదు. కండ్ల ముందే కార్యకర్తలు బలి అవుతుంటే చూస్తూ ఉండాలా. ఈ ప్రభుత్వం మాదీ అనే నమ్మకం కోల్పోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ. తెలంగాణ రాష్ట్రంలో తీసుకొనే నిర్ణయాలు జాతీయ స్థాయిలో ప్రభావం చూపిస్తాయి. రాహుల్ గాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగా నేను మాట్లాడితే తప్పా. నాకు పదవులు అనుభవించాలి అని లేదు. పార్టీ ఫిరాయింపు వారితో కలిసి పని చేయాలి అంటే ఎలా? మా కార్యకర్తను నడి రోడ్డు మీద హత్య చేశారు. కాంగ్రెస్ పార్టీతో 40 ఏళ్ల అనుబంధం తెంచుకోవడం బాధగా ఉంది. పదవులు కాదు. ఆత్మగౌరవం ముఖ్యం. ఎదిరించి పోరాడటం నాకు కొత్త కాదు. అవసరమైతే మళ్లీ పోరాటం చేస్తా.

- జీవన్ రెడ్డి




- నిస్వార్థంగా పనిచేసినా గౌరవం దక్కలేదు
- అవమానాలు భరించలేక, మానసిక క్షోభతో ఈ నిర్ణయం
- 66 స్థానాలు గెలిచినా ఫిరాయింపులు అవసరమా?
- వేం నరేందర్ కి రాజ్యసభ ఎలా ఇస్తారు?
- ఇక సీఎం రేవంత్‌పైనే నా పోరాటం
- జగిత్యాలలో కార్యకర్తల భేటీలో జీవన్‌రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

మార్చి 25: కాంగ్రెస్ సీనియర్‌నేత, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పార్టీ గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాజీనామా లేఖను పంపించారు. జగిత్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్తలను ఉద్దేశిస్తూ భావోద్వేగంగా మాట్లాడారు. అనంతరం రాజీనామా లేఖను

...:: మిగతా 2లో



పెట్రోల్, డీజీల్, ఎల్పీజీ కొరత లేదు

అనవసరంగా పుకార్లనునమ్మొద్దు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్

- కొరతపై రాష్ట్ర మంత్రుల ఉన్నతస్థాయి సమీక్ష
- 60 రోజులకు సరిపడా పెట్రోలు నిల్వలు ఉన్నాయి
- పుకార్లు సృష్టించే ఊరుకోం : సజ్జనార్
- క్యాన్లు, డబ్బాల్లో ఇంధనం పోయొద్దు: మంత్రి ఉత్తమ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 25: హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నేడు శాసనమండలి సమావేశపు హాలులో రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలతో ఆందోళన చెందవద్దని వినియోగదారులకు సూచించారు. రెగ్యులర్ గా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదాదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచుటకు

...:: మిగతా 2లో




పేదలపై బీఆర్ఎస్ కపట ప్రేమ

- ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు మనసు లేదు
- అందుకే బడ్జెట్ సమాధానం వినకుండా పారిపోయారు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎన్ని కోట్లయినా ఇస్తాం
- వారం వారం బిల్లుల చెల్లించడానికి సర్కార్ సిద్ధం
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 25: రాష్ట్రంలోని పేదల సంక్షేమం గురించి అసెంబ్లీలో వినడానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు మనసు లేదని, అందుకే బడ్జెట్ సమాధానం వినకుండా సభ నుంచి పారిపోయారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం అసెంబ్లీలో 'ప్రశ్నోత్తరాల సమయం'లో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రస్తుత ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటిచెప్పారు. "గత పాలకులు మాయమాటలు చెప్పి, ప్రజల్లో భ్రమలు కల్పించి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామని ఓట్లు వేయించుకున్నారు. కానీ, పదేళ్ల అధికారంలో ఏ ఒక్క పేదవాడికి ఇల్లు కట్టించి ఇవ్వకుండా

...:: మిగతా 2లో



ఏడుగురు ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు నోటీసులు

- కౌంటర్ దాఖలు చేయాలంటూ హైకోర్టు ఆదేశం
- స్పీకర్ నిర్ణయంపై హైకోర్టుకు బీఆర్ఎస్
- ఏప్రిల్ 16వ తేదీ విచారణను వాయిదా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 25: పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ

...:: మిగతా 2లో

ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపుల బంద్

- పౌల్ట్రీ కంపెనీలు ఇచ్చే మార్జిన్ సరిపోవడం లేదు
- తక్కువ మార్జిన్ కారణంగా నష్టాలు
- డిమాండ్లు పరిష్కరించకపోతే నిరవధికంగా షాపుల మూత
- ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి సమస్యను పరిష్కరించాలి
- రాష్ట్రంలో చికెన్ వ్యాపారుల ఆందోళన



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 25: పౌల్ట్రీ కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణలో చికెన్ వ్యాపారులు ఆందోళనకు దిగుతున్నారు. తక్కువ మార్జిన్ కారణంగా నష్టాలు ఎదుర్కొంటున్నామని

...:: మిగతా 2లో



మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఓబీసీలకు సబ్ కోటా కేటాయించాలి

- అన్ని వర్గాలకు మేలు చేసినప్పుడే అసలైన సామాజిక న్యాయం
- వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం లేని మహిళా రిజర్వేషన్ల బిల్లు అసంపూర్ణమే.
- అన్ని వర్గాలకు మేలు చేసినప్పుడే అసలైన సామాజిక న్యాయం
- లేదంటే జాగృతి తరపున దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం.
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 25: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కల నెరవేరే సమయం ఆసమన్నమవుతున్న తరుణంలో సామాజిక న్యాయాన్ని కూడా పాటించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఆ రిజర్వేషన్లలో ఓబీసీ మహిళల కోసం సబ్ కోటా ఉండటం అంతే ముఖ్యం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లును ప్రస్తుత లోక్ సభ సమావేశాల్లోనే ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో కవిత స్పందించారు. 'మహిళా బిల్లులో ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించకపోవడం అంటే మెజారిటీ ప్రజలను మోసం చేయటమే' అని పేర్కొన్నారు. చట్ట సభల్లో సామాజిక సమానత్వం రావాలంటే ఓబీసీ మహిళల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాల్సిందేనని అన్నారు. రిజర్వేషన్లలో రిజర్వేషన్ ఉంటేనే సామాజిక న్యాయం

...:: మిగతా 2లో



'యూటర్న్ ఉస్తాద్' ప్రధాని మోడీ

మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై మోడీ నిర్ణయాన్ని 'యూటర్న్ ఉస్తాద్' అంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. జనగణన, డిలిమిటేషన్ పూర్తి కాకుండానే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రయత్నించడం అనేది పూర్తిగా యూటర్న్ అని జైరాం రమేశ్ అని విమర్శించారు.

9



దేశంలో 100 కొత్త ఎయిర్ పోర్టులు

ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మిండానికి కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా ఎయిర్‌పోర్టులతోపాటు, హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్‌ను కూడా కేంద్రం నిర్మించనుంది.

9



పార్టీ ఆఫీస్ ఖాళీ చేయండి..

దేశ రాజధాని ఢిల్లీ 24, అక్బర్ రోడ్‌లో ఉన్న కాంగ్రెస్ కార్యాలయాన్ని శనివారం లోగా ఖాళీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆ పార్టీని ఆదేశించింది. ఈ బంగ్లా 48 ఏండ్లుగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంగా కొనసాగుతున్నది.

9



వందేమాతరంపై పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

అన్ని అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని కేంద్ర సర్క్యులర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టేసింది.

9

దమ్ముంటే సిద్దిపేటలో నాపై పోటీ చేసి గెలవాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సవాల్
- అసెంబ్లీని మరో వారం పొడిగించాలని డిమాండ్
- రైతులు సహా అన్ని వర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసింది
- డీలిమిటేషన్ వల్ల బీఆర్ఎస్‌కు మేలు జరుగుతుంది
- మహిళా రిజర్వేషన్లను మా పార్టీ స్వాగతిస్తుందని వ్యాఖ్య

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో



హైదరాబాద్, మార్చి 25: దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేసి గెలవాలని రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సవాల్ విసిరారు. అసెంబ్లీ లాబీలో చిట్ చాట్‌లో భాగంగా హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తల్లకిందులుగా తపస్సు చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని, రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల బీఆర్ఎస్‌కు మేలు జరుగుతుందని, మహిళా రిజర్వేషన్లను తమ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక, రాజకీయ నష్టం జరుగుతుందని కూడా ఆయన పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలే..

ఇక ఉద్యోగాల అంశంపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని వ్యాఖ్యానించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,978 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, మొత్తం 16 నోటిఫికేషన్లు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. సంక్షేమ బోర్డుల పరిస్థితిపై కూడా హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 33 సంక్షేమ బోర్డులు ఉన్నప్పటికీ, వాటిలో 16కి మాత్రమే కార్యాలయాలు ఉన్నాయని, మిగిలిన 17 బోర్డులకు కార్యాలయాలు కూడా లేవని తెలిపారు. కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో 99 శాతం లాప్స్ అవుతున్నాయని, కేవలం 2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ నిర్వహణపై కూడా ఆయన విమర్శలు చేశారు. సభను సమయానికి ప్రారంభించడం లేదని, టీ బ్రేక్ పేరుతో గంటల తరబడి వాయిదాలు వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి రావడం, మంత్రుల సిద్ధత వంటి కారణాలతో సభను తరచుగా వాయిదా వేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష గొంతును నొక్కుతున్నారని ఆరోపించిన హరీష్, అసెంబ్లీని మరో వారం రోజుల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.

పెట్రోల్, డీజీల్, ఎల్పీజీ కొరత లేదు

మొదటిపేజీ తరువాయి

రెగ్యులర్ గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీలకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

క్యాన్లు, డబ్బాల్లో ఇంధనం
పోయొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదతని మంత్రి ఉత్తమ్ అన్నారు. వచ్చే 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్‌కు కొరత లేదని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం కొన్ని బంకులు పెట్రోల్ లేక మూసివేయడంతో జనం ఆందోళనకు గురయ్యారు. దీంతో సాయంత్రం నుంచి బంకుల ముందు క్యూ కట్టారు. ఉదయం నుంచి ఇదే పరిస్థితి కనిపించడం, దీనికి తోడు పలు బంకులు మూతపడటంతో ఉత్తమ్ స్పందించారు. రాష్ట్రంలో వచ్చే 2 నెలలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. బుధవారం డిమాండ్ 17,246 కిలోలీటర్లు కాగా, 17,898 కిలోలీటర్లు సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం కారణంగా డిమాండ్ 25 శాతం పెరిగినప్పటికీ, సరఫరా సగటుకు మించి 22 శాతం అధికంగా కొనసాగుతోందని, అదనంగా 16,000 కిలోలీటర్ల బఫర్ స్టాక్ సిద్ధం చేశామని, 1,200 అదనపు ట్యాంకర్లను రంగంలోకి దించామని పేర్కొన్నారు. చాలాచోట్ల ప్రజలు భయంతో ముందు జాగ్రత్త కోసమని క్యాన్లు, కంటెయినర్లలో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లడంపై మంత్రి స్పందించారు. ఇలా క్యాన్లలో తీసుకెళ్లడం చట్టవిరుద్ధమని, అలా చేసినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిధిలో 596 పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్నాయని, ఏ బంకునూ మూసివేయడానికి అనుమతించమని స్పష్టం చేశారు.

పుకార్లు సృష్టించే ఊరుకోం : సజ్జనార్

మరోవైపు హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే పుకార్లు నమ్మొద్దని సీపీ సజ్జనార్ కోరారు. పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 60 రోజులకు సరిపడా పెట్రోలు నిల్వలు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. ఎవరు కూడా అపోహలు నమ్మవద్దని, సోషల్ మీడియా వార్తలపై నిఘా పెట్టామని తెలిపారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జన్నార్, సుధీర్ బాబు, ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేదలపై బీఆర్ఎస్ కపట ప్రేమ

మొదటిపేజీ తరువాయి

వారిని గాలికి వదిలేశారు" అని భట్టి విమర్శించారు. బడ్జెట్ ప్రతులను చింపి, చెవిలో పెట్టుకుని వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బడ్జెట్ కేటాయింపుల గురించి మాట్లాడే అర్హత లేదని భట్టి విక్రమార్క మండిపడ్డారు. "పేదలు ఇల్లు కట్టుకుని ఆత్మగౌరవంతో బతకడం విపక్షాలకు ఇష్టం లేదు. బడ్జెట్‌లో నిధులు తగ్గించామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏకంగా ₹22,500 కోట్లు కేటాయించాం" అని స్పష్టం చేశారు. హౌసింగ్ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారని భట్టి తెలిపారు. పనులు వేగవంతం చేసేందుకు గతంలోలాగా నెలల తరబడి వేచి చూడకుండా, వారానికోసారి బిల్లులు చెల్లించేలా నిక్కచ్చిగా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటివరకు లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు ₹5,000 కోట్లు దాటలేదని, ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నిర్మాణాలు ఎంత వేగంగా జరిగితే, అంత త్వరగా నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు ఉండకూడదన్న ఆశయంతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎన్ని కోట్ల రూపాయలైనా వెచ్చించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

గ్రీన్‌ఎనర్జీపై ప్రత్యేక దృష్టి

గ్రీన్ ఎనర్జిని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలన్న ఆలోచనలు రాష్ట్ర ప్రభుత్వం ఉంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు అడిగిన ప్రశ్నలకు భట్టి విక్రమార్క జవాబిచ్చారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం పరిశీలన చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో గృహ ఉపయోగ, వ్యవసాయ రంగానికి సంబంధించి 81 గ్రామాల్లో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 38,216 గ్రామాలు మరియు 16,078 వ్యవసాయ పంప్ సెట్ లకు సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తున్నాం అన్నారు.

ఏడుగురు ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై బుధవారం విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికేపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పిటిషనర్లు స్పష్టం చేశారు. వారంతా బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకొని ఆ పార్టీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అన్ని మీడియాల్లోనూ వీరు కండువా కప్పుకున్న దృశ్యాలు వచ్చాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు చెబితేనే స్పీకర్ స్పందిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరితే.. ఏడాది పాటు ఎలాంటి చర్య తీసుకోలేదని తెలిపారు. సుప్రీంకోర్టు చెప్పిన తర్వాతే స్పీకర్ స్పందించారని కోర్టుకు వివరించిన పిటిషనర్ న్యాయవాది. ఈ నేపథ్యంలో పర్సనల్ నోటీస్ ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలన్న కోర్టు పిటిషనర్ న్యాయవాది కోరారు. దాంతో వారికి స్పీడ్ పోస్ట్ చేయాలని హైకోర్టు ఆదేశించింది.

ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపుల బంద్

మొదటిపేజీ తరువాయి

పేర్కొంటూ, ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు. పౌల్ట్రీ కంపెనీలు ఇచ్చే మార్జిన్ సరిపోవడం లేదని వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యాపారం నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. చికెన్ ధరలు పెరిగినా, మధ్యవర్తుల విధానాల వల్ల తాము లాభపడడం లేదని వ్యాపారులు అంటున్నారు. తమ సమస్యలను పౌల్ట్రీ కంపెనీలకు పలుమార్లు తెలియజేసినా, సరైన స్పందన రాలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధికంగా చికెన్ షాపులను మూసివేస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 1 నుంచి బంద్ ప్రారంభమవుతుందని ప్రకటించారు. చికెన్ షాపుల బంద్ వల్ల వినియోగదారులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు కోరుతున్నారు.



ఇంధన కొరత వార్తలు అవాస్తవం

- రాష్ట్రంలో సరిపడా నిల్వలు ఉన్నాయ్
- వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి25: రాష్ట్రంలో ఇంధన కొరతపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ మరియు పెట్రోలియం ఆయిల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ స్పష్టం చేశాయి.రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్,డీజిల్ సరిపడా నిల్వలు ఉన్నాయని,సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని వెల్లడించాయి.తప్పుడు ప్రచారాల కారణంగా పెట్రోల్ బంకుల వద్ద అనవసర రద్దీ ఏర్పడుతున్నదని,దీని వల్ల కొన్నిచోట్ల తాత్కాలిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.అయితే ఎక్కడా ఇంధన కొరత లేదని స్పష్టం చేశారు.ఆయిల్ కంపెనీల వద్ద తగిన నిల్వలు ఉండి నిరంతర సరఫరా కొనసాగుతోందని,రవాణా కారణాల వల్ల ఎక్కడైనా ఆలస్యం జరిగినా అది తాత్కాలికమేనని తెలిపారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని,నిర్ధారణ లేని సమాచారాన్ని పంచుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని,బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా పటిష్టంగా కొనసాగుతోందని తెలిపారు.ఈ అవగాహన కార్యక్రమంలో కొప్పుల నర్సింహ రెడ్డి,నరేష్ యాదవ్,అమరేష్ ముదిరాజ్,పోరెడ్డి రవీందర్ రెడ్డి,ఆల్వాల మధుకర్ గౌడ్,మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఓబీసీలకు సబ్ కోటా కేటాయించాలి

మొదటిపేజీ తరువాయి

జరుగుతుందని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

మళ్లీ పోరాటం తప్పదు

ఓబీసీ మహిళలకు ఉప కోటా లేకుండా ముందుకు వెళ్లాలని కేంద్రం భావిస్తే మరోసారి పోరాటం తప్పదని కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మహిళ రిజర్వేషన్ల బిల్లు కోసం ఏ విధంగా పలు రాజకీయ పార్టీలను, మహిళ సంఘాలను ఏకం చేసి ఢిల్లీలో దీక్ష చేస్తామని, అదే విధంగా మరోసారి పోరాటం చేస్తామన్నారు. మహిళ రిజర్వేషన్ల బిల్లు పార్లమెంట్ లో పెట్టిన సందర్భంలోనే తాము ఈ డిమాండ్ చేశామని కవిత గుర్తు చేశారు. ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వకుండా మహిళా రిజర్వేషన్లు వచ్చినా, ఆయా వర్గాల ఆడబిడ్డలకు చట్టసభల్లో అడుగు పెట్టే అవకాశం దక్కదని కవిత ఆందోళన వ్యక్తం చేశారు.

అన్ని వర్గాలకు మేలు చేయటమే సామాజిక న్యాయం

దేశంలో అన్ని వర్గాలకు మేలు చేయటమే సామాజిక న్యాయమని కవిత అన్నారు. దేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న ఓబీసీ వర్గాల మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించకపోతే వారికి ఎలా న్యాయం దక్కుతుందని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు రాజ్యాంగబద్ధ వాటా ఉందని, కానీ ఓబీసీల పరిస్థితి ఏంటనీ నిలదీశారు. ఈ విషయంలో అన్ని పార్టీల నాయకులు, ఆయా పార్టీల్లో ఉన్న ఓబీసీ మహిళ నేతలు, మహిళా సంఘాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఓబీసీ మహిళలకు ఉప కోటా కేటాయించే వరకు జాగృతి తరఫున మరోసారి పోరాటం చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

మహిళ బిల్లు ఆమోదం పొందటం లో కీలక పాత్ర..

దేశ రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో జాగృతి అధ్యక్షురాలుగా తాను, తమ నాయకులు చేసిన పోరాటం ఫలితంగా మహిళ రిజర్వేషన్ల బిల్లుకు ముందడుగు పడిందన్నారు. దేశంలోని 18 రాజకీయ పార్టీలను, మహిళా సంఘాలను, పలు ప్రజా సంఘాలను ఏకం చేసి జంతర్ మంతర్ సాక్షిగా నిరాహార దీక్ష చేశామని గుర్తు చేశారు. మహిళ రిజర్వేషన్ల బిల్లు తెచ్చే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చామన్నారు. రౌండ్ టేబుల్ సమావేశాలు, మేధావులతో చర్చలు, పలు నిరసన కార్యక్రమాల ద్వారా ఈ అంశాన్ని జాతీయ అజెండాగా మార్చగలిగామని తెలిపారు. ఇదే సందర్భంగా ఓబీసీ మహిళ కోటా కేటాయిస్తూ సామాజిక న్యాయం కూడా చేయాలని కోరారమని చెప్పారు. మహిళల కోటాలో ఓబీసీ సబ్ కోటా ప్రస్తావన లేకపోవడం విచారకరమని అన్నారు. కేంద్రం ఓబీసీ కోటాపై స్పందించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి రాజీనామా


మొదటిపేజీ తరువాయి



విడుదల చేశారు. 42 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో నిస్వార్థంగా పనిచేసినా సరైన గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా అవమానాలు భరించలేక, మానసిక క్షోభతో ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. ఆత్మగౌరవ పోరాటం చేద్దామని తన అనుచరులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శ్రమతోనే రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చిందని జీవన్‌రెడ్డి అన్నారు. 'నా రాజీనామాతో అయినా ముఖ్యమంత్రి మారతాడు అనుకుంటున్నా' అని జీవన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ 66 స్థానాలు గెలిచినా ఫిరాయింపులు అవసరమా? అని ప్రశ్నించారు. 'పది స్థానాలలో ఫిరాయింపు ఎమ్మెల్యేలని ప్రోత్సహించారు, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ కి రాజ్యసభ ఎలా ఇస్తారు? మధుయాష్కి, చిన్నారెడ్డిలకి ఇవ్వకూడదా?' అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. పార్టీలో ఉన్న పరిస్థితులపై 2024 అక్టోబర్‌లో హైకమాండ్‌కు లేఖ రాశానని గుర్తుచేశారు. తనకు తోడుగా నిలిచి గంగారెడ్డిని నడి బజారులో కిరాతకంగా చంపారని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్త దారుణంగా చనిపోతే స్పందించకూడదా అని ఆయన ప్రశ్నించారు. ఆ కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి నుంచి కనీస పరామర్శ, ఓదార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాన్ని చూసినప్పుడల్లా తనకు బాధేస్తుందని అన్నారు. శాసనమండలి సభ్యుడినైన తాను కూడా రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. పదవి కాదు.. గౌరవం కావాలన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. తనకు పోరాటం కొత్త కాదని, ఇప్పుడు రేవంత్ రెడ్డిపై పోరాటం చేస్తామన్నారు. ఎంతకాలం ఈ అవమానాలు అని వాపోయారు. కార్యకర్తలు అనుచరుల అండదండలతో ఈ స్థాయికి ఎదిగినట్లుగా వివరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచించిన సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసినా తనను అణగదొక్కారని ఆయన ఆరోపించారు. కార్యకర్తలు కన్నీళ్లు పెట్టుకోవడంతో పాటు "జీవన్ రెడ్డి వెంటే" అంటూ నినాదాలు చేశారు. పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా పార్టీకి రాజీనామా చేశారు. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర స్థాయిలో పెద్ద దెబ్బగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జీవన్ రెడ్డి తదుపరి రాజకీయ అడుగులపై ఆసక్తి నెలకొంది.

మా షరతులు, డిమాండ్లు నెరవేర్చండి

మొదటిపేజీ తరువాయి



అంతర్జాతీయ గుర్తింపు, హామీలు ఇవ్వాలని ఇరాన్ షరతులు విధించింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేశాయి. దానికి కొద్ది రోజుల ముందు జెనీవాలో జరిగిన రెండో విడత చర్చల సందర్భంగా టెహ్రాన్ చేసిన డిమాండ్లకు పై 5 షరతులు అదనం అని సదరు ఇరాన్ భద్రతాధికారి పేర్కొన్నారు. 'ఈ షరతులకు అమెరికా, ఇజ్రాయెల్‌లో ఒప్పుకోకపోతే, ఇక ఎలాంటి చర్చలు జరగవు' అని సదరు అధికారి తేల్చిచెప్పారు. అంతేకాదు నిర్దేశిత షరతులు నెరవేరే వరకు ఇరాన్ రక్షణ చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

ఇరాన్‌కు అమెరికా 15 పాయింట్ల
కాల్పుల విరమణ ప్రతిపాదన

అంతకు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని ప్రభుత్వం ఇరాన్‌కు 15 పాయింట్ల కాల్పుల విరమణ ప్రతిపాదనను అందజేసిందని సమాచారం. ఆ సీజ్ ఫైర్ ప్రణాళికను పాకిస్థాన్ మధ్యవర్తుల ద్వారా ఇరాన్ అధికారులకు చేరవేసినట్లు తెలుస్తోంది. అయితే అమెరికా రక్షణ శాఖ అయిన పెంటగాన్ మాత్రం తన సైనిక చర్యలను కొనసాగిస్తోంది.. ఇప్పటికే పశ్చిమాసియాలా సుమారు 50,000 మంది అమెరికా సైనికులు ఉన్న నేపథ్యంలో, అదనంగా కనీసం 1,000 మంది సైనికులను పంపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా 82వ ఎయిర్‌బోర్న్ డివిజన్ నుంచి సైనికులను తరలించనున్నట్లు సమాచారం. అదేవిధంగా, రెండు మెరైన్ ఎక్స్‌పిడిషనరీ యూనిట్స్‌ను కూడా పంపించే ప్రక్రియలో అమెరికా ఉంది. దీని ద్వారా మరో 5,000 మంది మెరైన్లు, వేలాది నౌకాదళ సిబ్బంది పశ్చిమాసియా ప్రాంతానికి చేరుకోనున్నారు. ఈ చర్యలన్నీ చూస్తే అమెరికా ఒకవైపు చర్చలకు సిద్ధమవుతూనే, మరోవైపు యుద్ధానికి కూడా సిద్ధంగా ఉందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలు ఇజ్రాయెల్ అధికారులను ఆశ్చర్యానికి గురిచేశాయని సమాచారం. ఇప్పటివరకు ఇరాన్‌పై కఠిన చర్యలు కొనసాగించాలని కోరుతున్న ఇజ్రాయెల్ నేతలు, అకస్మాత్తుగా అమెరికా సీజ్ ఫైర్ ప్రతిపాదన చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు సమాచారం. అమెరికా నిర్ణయాలు ముందస్తుగా తెలియకపోవడం కూడా వారికి అసహనంగా మారినట్లు తెలుస్తోంది.

అమెరికా నౌకపై ఇరాన్ దాడి

అమెరికాకు చెందిన భారీ యుద్ధవిమాన వాహక నౌక అబ్రహం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించింది. తీర ప్రాంతం నుంచి ప్రయోగించే అత్యాధునిక 'ఖాదర్' యాంటీషిప్ క్రూయిజ్ క్షిపణులను అబ్రహం లింకన్‌పైకి ప్రయోగించింది. తమ దాడుల తీవ్రత తప్పించుకునేందుకు ఆ భారీ నౌక తన స్థానం మార్చుకుందని టెహ్రాన్ పేర్కొంది. తమ సముద్ర జలాలపై సార్వభౌమాధికారాన్ని చాటుకునేందుకే ఈ దాడి చేసినట్టు ఇరాన్ స్పష్టం చేసింది. తమ క్షిపణి పరిధిలోకి వస్తే మరిన్ని దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించిన గంటలోనే ఎటాక్ చేసింది.



నాపై ట్రోల్ చేసేవారు ఎవరో, ఎక్కడ ఉంటారో తెలియదు. వాళ్లకు కనీసం తమ గుర్తింపును బయటపెట్టే ధైర్యం కూడా లేదు. అలాంటి వారిని నేను అస్సలు పట్టించుకోను. అలా అయితే ఎప్పుడో సోషల్ మీడియాను వీడేవాడిని. ఎన్ని అడ్డంకులు వచ్చినా 'ఉస్తాద్ భగత్‌సింగ్'ను సకాలంలో థియేటర్లలోకి తీసుకురావడమే నా అతిపెద్ద విజయం.
- డైరెక్టర్ హరీశ్ శంకర్



జనగణలో బీసీ కుటుంబాలను లెక్కించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల
- కేంద్ర మంత్రులను కలిసిన బీసీ నాయకులు
- బీసీలకు ఇచ్చిన హామీల అమలుపై చర్చ



ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 25: జాతీయ జనగణలో బీసీ కుటుంబాలను కూడా లెక్కించాలనే ప్రధాన డిమాండ్ తో ఆందోళన బాట పట్టిన బీసీ సంఘాల నేతలు, బుధవారం కేంద్ర మంత్రులతో బీసీ డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ జనగణలో బీసీ కుటుంబాలను లెక్కించాల్సిన అవశ్యకత, కేంద్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీల అమలుపై కేంద్ర మంత్రులతో చర్చించారు. చర్చల వివరాలను ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావుల ఆధ్వర్యంలోని బీసీ ప్రతినిధుల బృందం ఢిల్లీలోని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్లను వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తాము దేశవ్యాప్తంగా కొన్ని దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితంగా, కేంద్ర ప్రభుత్వం ఈ సారీ జరిగే జాతీయ జనగణలో సమగ్ర కులగణన చేపడుతామని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఇదే సమయంలో రెండు దపాలుగా జరుగుతున్న జనగణనలో మొదటి దపా జరిగే కుటుంబాల లెక్కింపులో ఎస్సీ,ఎస్టీ కుటుంబాలను లెక్కిస్తు, బీసీ కుటుంబాలను మాత్రం లెక్కించడం లేదని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. బీసీ కుటుంబాలను కూడా లెక్కిస్తేనే భవిష్యత్తులో బీసీ సమగ్ర కులగణన డేటా సంపూర్ణంగా మొదటిసారిగా అధికారికంగా అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. ఏప్రిల్ 1న ప్రారంభమయ్యే కుటుంబాల లెక్కింపు కోసం జరిగే 33 కాలంలో తోపాటు 34వ కాలంగా ఓబీసీ కుటుంబాలను కూడా చేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు మాట్లాడుతూ దేశంలో నేటి వరకు బీసీ కులగనన అందుబాటులో లేక పోవడం మూలంగా బీసీలకు విద్యా, ఉద్యోగ రాజకీయ రంగంలో రిజర్వేషన్లు జనాభా దామాషా ప్రకారం దక్కలేదని, భవిష్యత్తులోనైనా ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ లకు జనాభాష ప్రకారం వాటా దక్కినట్లుగానే, బీసీలకు కూడా చట్టబద్ధంగా అమలు జరుగుతుందని ఆయన తెలిపారు. బీసీలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని శంకర్రావు కేంద్ర మంత్రులను కోరారు. కేంద్ర మంత్రులను కలిసిన ప్రతినిధి బృందంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యామ్, బి మణి మంజరి, పిట్టల శ్రీధర్, రావులకోల్ నరేష్, ఉదయనేత, గొడుగు మహేష్ యాదవ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, శివకుమార్, సంసాని శ్రీనివాసరావు, కిరణ్, సంధ్యారాణి, వేణు, కొప్పుల చందు, నాగరాజు గౌడ్, త్రిలోక్ సింగ్, శివమ్మ, విజయలక్ష్మి, రేణుక, రత్నమాల తదితరులు ఉన్నారు.







సొంతింటి కల సాకారం చేసిన కాంగ్రెస్ సర్కార్

- ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం
- మహేశ్వరం/కందుకూరు మండలాల్లో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పర్యటన

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి25: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం గంగారం గ్రామపంచాయతీ పరిధిలోని మైలార్ బాయి తండా,గంగారంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిచ్చెన్న లక్ష్మారెడ్డి హాజరై గృహప్రవేశాన్ని నిర్వహించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతోందని,ప్రభుత్వం ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకువస్తోందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ఆనందోత్సాహాలతో కిచ్చెన్నకి ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్,ఉప సర్పంచ్ మహేందర్,వార్డ్ సభ్యులు మునావత్ రవి, ఎం.లావణ్య, ఎం.పద్మ, ఎం.ధర్మ, ఎం.గోపి, ఎం.భాస్కర్, ఎం.శ్రీనివాస్ తదితరులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గుంటూరు జిల్లా పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె వివాహ వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

\- ప్రతిపక్షం, హైదరాబాద్

ప్రయాణీకులకు ఆర్టీసీ బంపర్ ఆఫర్

- మెట్రో, ఏసీ, డీలక్స్‌బస్సుల్లో 30% రాయితీ
- ప్రకటించిన ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి
- అపోహలను నమ్మొద్దు: హైదరాబాద్ కలెక్టర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 25: హైదరాబాద్‌పరిధిలోని ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. మెట్రో ఏసీ, డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తలెత్తిన ఇంధన కొరత దృష్ట్యా, నగర వాహనదారులకు ఊరటనిచ్చేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి వేచిచూస్తున్న సామాన్యుడి కష్టాలను గమనించి, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని తక్కువ ధరకే అందించేందుకు ఆర్టీసీ సిద్ధమైందని, హైదరాబాద్ పరిధిలోని మెట్రో ఏసీ, మెట్రో డీలక్స్ బస్సుల్లో టికెట్ ధరలపై 30 శాతం రాయితీని కల్పిస్తున్నట్లు సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి ప్రకటించారు. ఈ మేరకు నగరవాసులు ఈ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అపోహలను నమ్మొద్దు: హైదరాబాద్ కలెక్టర్

పెట్రోల్ కొరత ఉందన్న అపోహలపై హైదరాబాద్ కలెక్టర్ హరిచందన స్పందించారు. పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే పుకార్లను నమ్మి ఇబ్బంది పడవద్దని ఆమె నగరవాసులకు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే కథనాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. హైదరాబాద్‌లో సీపీ సజ్జనార్‌తో కలిపి ఆమె అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లుగా తెలిపారు. సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేసేవారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోనున్నట్లుగా వెల్లడించారు. మంత్రులు, అధికారులు ఎన్ని రకాలుగా విజ్ఞప్తి చేసినా ప్రజల్లో పెట్రోల్ భయం మాత్రం తగ్గడం లేదు. రాబోయే రోజుల్లో సమస్య మరింత తీవ్రం అవుతుందన్న భయాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం చూసి చాలామంది అవసరం లేకున్నా ఎక్కువ పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు. పెట్రోల్ బంకుల అసోసియేషన్ కూడా ఇదే విషయం నిర్ధారించింది. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం వల్ల మంగళవారం 3 రెట్లు ఎక్కువ పెట్రోల్ విక్రయం జరిగిందని తెలిపారు.



జీవన్ రెడ్డి పార్టీ వీడిపోవడం బాధాకరం

- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 25: జీవన్ రెడ్డి లాంటి క్రమశిక్షణతో ఉన్న నాయకులు పార్టీ వీడడం బాధాకరం అని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి అన్నారు. పార్టీలో ఉండి అడగాలని, కొన్ని రాజకీయ సమీకరణాలతో అందరికి పదవులు రావడం లేదని అన్నారు. ప్రభుత్వం పటిష్టమైన పాలన చేయాలంటే కొంత సర్దుకుపోవాలని అన్నారు. జీవన్ రెడ్డి మనసు మార్చుకొని పార్టీలో కొనసాగాలని ఆయన అన్నారు. పరిస్థితులను బట్టి నాయకులకు అవకాశాలు వస్తాయని, వేచి చూడాలని అన్నారు. జీవన్ రెడ్డికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా సుదీర్ఘ కాలం పాటు రాజకీయాలు చేసిన అనుభవం ఉందని, ఆయన లాంటి వారు ఓపికగా రాజకీయాలు చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రులకు అండగా ప్రజాపాలనకు సహకారాన్ని అందిస్తే బాగుండేదని అన్నారు.

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ గిరిజనులకు పునరావాసం

- బాధిత కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం
- చెక్కులు అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 25: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నివసిస్తున్న గిరిజనుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల అభీష్టం మేరకే పునరావాసం చేపడుతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ కౌన్సిల్ హాల్‌లో 14 గిరిజన కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా 160 కుటుంబాలకు నగదు పరిహారం ఇవ్వగా, 257 కుటుంబాలకు ఇల్లు, 5 ఎకరాల భూమిని కేటాయిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద ఆధునిక సదుపాయాలతో పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం రూ.62.55 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. పునరావాసం తర్వాత గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. గిరిజన పిల్లలకు ఆధునిక పాఠశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు. దేశంలోనే అత్యధిక పరిహారాల్లో ఒకటిగా భావిస్తున్న రూ.15 లక్షల ప్యాకేజ్ ద్వారా గిరిజనులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా, ఈ పునరావాసం ద్వారా సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు అవకాశం లభించనుంది. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు ఇది కీలకంగా మారనుంది. బచారం పునరావాస కాలనీని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, ఉత్తం కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీలో ఇప్పసారా రచ్చ..

- ఇప్పసారా తయారుచేస్తే ఇందిరమ్మ పేరు పెట్టొద్దు
- బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వ్యాఖ్య
- ఆ వ్యాఖ్యలపై మంత్రుల ఆగ్రహం
- ఇందిరాగాంధీని అవమానించలేదు: రాకేష్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 25: తెలంగాణ అసెంబ్లీలో ఇప్పసారా అంశంపై చర్చ రభసకు దారి తీసింది. ఇప్పసారాపై కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన వెర్షన్ వినిపించగా, బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఇప్పసారా అంటే ప్రభుత్వానికి నవ్వులాటగా ఉందని మండిపడ్డారు. ఇప్పసారా తయారుచేస్తే ఇందిరమ్మ పేరు మాత్రం పెట్టొద్దని అన్నారు. దీంతో మంత్రులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇప్పసారా గురించి మాట్లాడుతూ ఇందిరమ్మ పేరు తీయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. రాకేష్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 'ఇందిరాగాంధీపై అంత కక్ష ఎందుకు?. మహిళా నేతను కించపరిచారు. రాకేష్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి. సంక్షేమ పథకాలకు మాత్రమే ఇందిరమ్మ పేరు పెడతాం. సంక్షోభం తెచ్చేవాటికి కాదు' అని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మహిళలకు బీజేపీ ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. రాకేష్‌రెడ్డి నోరు జారారని, క్షమాపణ చెప్పాల్సిందేనని అన్నారు.

ఇందిరాగాంధీని అవమానించలేదు: రాకేష్‌రెడ్డి

తాను ఇందిరాగాంధీని అవమానించలేదని బీజేపీ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి స్పష్టం చేశారు. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..' ఇందిరాగాంధీ ఉక్కు మహిళ.. ప్రపంచస్థాయి నేత. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలకు ఇందిరమ్మ పేరు పెడుతుంటారు. ఇప్పసారా పథకానికి గొప్ప మహిళానేత ఇందిర పేరు పెట్టొద్దని.. గౌరవంతో సూచించా గానీ అవమానించాలని కాదు. నా వ్యాఖ్యల్లో ఎలాంటి తప్పు లేదు. తమాషా చేస్తున్నారా అంటూ నన్ను బెదిరిస్తారా?. నేనేం తప్పు మాట్లాడానో రికార్డులు పరిశీలించండి. అవసరమైతే హౌస్ కమిటీ వేయండి. క్షమాపణ చెప్పాల్సి వస్తే చెబుతా. మాజీ ప్రధాని ఇందిర అంటే మాకు ఎప్పుడూ గౌరవమే' అని అన్నారు.



సిరిసిల్ల నేతన్నలపై విద్యుత్ భారం లేకుండా చేయండి

- సిరిసిల్ల పవర్‌లూమ్ విద్యుత్ బకాయిలు, సర్‌చార్జిలతు పూర్తిగా మాఫీ చేయాలి
- రాష్ట్ర మంత్రులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్ వినతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 25: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను రక్షించాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిసి వినతిపత్రం అందజేశారు. సిరిసిల్లలోని పవర్‌లూమ్ యూనిట్లపై పేరుకుపోయిన విద్యుత్ బకాయిలు, సర్‌చార్జిల భారాన్ని వివరించి వాటిని పూర్తిగా మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ కాలంలో 25 హెచ్.పీ వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల ఈ పరిశ్రమ నిలదొక్కుకుందని, కానీ ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న 'బ్యాక్ బిల్లింగ్' కారణంగా పరిశ్రమ మళ్లీ సంక్షోభంలో పడిందని తెలిపారు.2016 నుంచి 2024 వరకు సుమారు 127 ఎస్ఎస్ఐ యూనిట్లపై రూ.19 కోట్ల మేర బ్యాక్ బిల్లింగ్ విధించగా, సర్‌చార్జిలతో కలిపి ఈ మొత్తం రూ.38 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ భారీ భారం తట్టుకోలేక అనేక యూనిట్లు మూతపడుతున్నాయని, వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలను ప్రస్తావిస్తూ, ఈ పరిస్థితిని మానవీయ కోణంలో పరిశీలించి విద్యుత్ బిల్లుల భారాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు.నేతన్నల జీవనోపాధి కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రులను అభ్యర్థించారు.

'దేవాదుల' కోసం కడియం ఎలాంటి పాత్ర పోషించలేదు

- ప్రాజెక్టు సృష్టికర్త తానేనని చెప్పుకోవడం సిగ్గుచేటు
- ఎమ్మెల్యే శ్రీహరిపై పల్లా ఘాటు వ్యాఖ్యలు



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్: అసెంబ్లీ లాబీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు. దేవాదుల ప్రాజెక్టు సృష్టికర్త తానేనని కడియం చెప్పుకోవడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 2004నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేవాదుల ప్రాజెక్టు కోసం కడియం శ్రీహరి ఎలాంటి పాత్ర పోషించలేదని పల్లా ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు తానే సృష్టికర్తనని చెప్పుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. అలాగే కడియం శ్రీహరికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో అవకాశాలు ఇచ్చారని తెలిపారు. ఎంపీ, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వంటి కీలక పదవులతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా రాజకీయ అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. కడియం శ్రీహరి బినామీ పేర్లతో ఆస్తులు కూడబెట్టారని పల్లా రాజేశ్వరరెడ్డి ఆరోపించారు. ఆయన నిజాయితీ గల నాయకుడు కాదని తీవ్రంగా విమర్శించారు. ఇక డీలిమిటేషన్ జరిగినా జనగామ ప్రజలకు సేవ చేయడం కొనసాగిస్తానని పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

కోనేటి నీటిలో పడి వృద్ధురాలి మృతి



ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చ్ 25: రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండల కేంద్రంలోని శివ గంగ కోనేటి పరిధిలో ఒక వృద్ధ మహిళ నీటిలో పడి మృతి చెందినట్లు మహేశ్వరం పోలీసులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే మహేశ్వరం పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఎరుపు రంగు చీర ధరించి ఉండగా, రెండు చేతులకు పచ్చ బొట్లు, బంగారు రంగు గాజులు ఉన్నాయి. మెడలో ఎరుపు రంగు పూసల గొలుసు ధరించి ఉంది. మృతురాలి వయస్సు సుమారు 55 నుండి 65 సంవత్సరాల మధ్యగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఈ ఫోటోలో కనిపిస్తున్న మృతురాలి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు దయచేసి మహేశ్వరం పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.



తెలంగాణకు పెట్రోల్, గ్యాస్ సరఫరాపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీతో మాట్లాడాను. తగినంత నిల్వలు ఉన్నాయని, ఎలాంటి ఆందోళన అవసరంలేదని పూరీ చెప్పారు. ఎల్పీజీ సరఫరాను సమర్థవంతంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాం. వదంతులు వ్యాప్తి చేసే వారిపై, పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టించేవారిపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
గురువారం
26.03.2026
@prathipaksham
prathipakshamtvtelugu

ఓపెన్ వాయిస్

బెంగాల్ ఫలితం గేమ్ ఛేంజర్ అవుతుందా

పశ్చిమ బెంగాల్‌లో 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రభావం ఇప్పటికీ ఆ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై గట్టిగానే కనిపిస్తోంది. అయితే అది కేవలం గతం జ్ఞాపకంగా నిలిచిపోలేదు; 2026 ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అది మారుతూ, మరింత స్పష్టమైన సూచనగా కనిపిస్తోంది. ఒకప్పుడు అనేక పార్టీల మధ్య జరిగిన పోటీ, గత దశాబ్దంలో క్రమంగా కుదించుకుపోయి, ఇప్పుడు ప్రధానంగా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), భారతీయ జనతా పార్టీ (బిజెపి) మధ్య ద్వైపాక్షిక పోరాటంగా మారింది. ఇదే సమయంలో వామపక్షాలు తమ రాజకీయ ప్రాధాన్యాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, వాటి విజయాలు పరిమితంగానే ఉన్నాయి. ఇప్పుడు ప్రధాన ప్రశ్న ఎవరు ముందుంటారు అనేది మాత్రమే కాదు; 2021లో ఏర్పడిన రాజకీయ సమతుల్యత స్థిరమా లేక సున్నితమైనదా అనేదే కీలకం. 2021 ఎన్నికల ఫలితం చూస్తే అది స్పష్టమైన విజయం. మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి మూడింట రెండు వంతుకుపైగా అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని, దాదాపు సగం ఓట్లను సంపాదించింది. అయితే ఆ విజయంలో ఒక ముఖ్యమైన మార్పు కూడా దాగి ఉంది. బిజెపి అట్టడుగు స్థాయినుంచి ఎదిగి, ఒక బలమైన ప్రతిపక్షంగా మారింది. దాదాపు ఐదో వంతులో రెండో వంతు ఓట్లను సంపాదించి, వామపక్ష, కాంగ్రెస్ కూటమిని పక్కకు నెట్టింది. ఈ మార్పు ప్రాధాన్యం చాలా గొప్పది. ఎన్నాళ్లుగా సిద్ధాంతపరమైన పోటీలు, వర్గాల పొత్తు రాజకీయాలతో సాగిన బెంగాల్ రాజకీయాలు, ఇప్పుడు రెండు వేర్వేరు రాజకీయ విధానాలను ప్రతిబింబించే పార్టీల మధ్య నేరుగా, స్పష్టమైన పోటీగా మారాయి. ఒకటి ప్రాంతీయ ఆధిపత్యం, సంక్షేమ కార్యక్రమాలపై ఆధారపడితే, మరొకటి జాతీయ ఏకీకరణ, గుర్తింపు రాజకీయాలపై దృష్టి పెట్టింది.ఐదేళ్లు గడిచిన తర్వాత కూడా, టిఎంసి ఆధిపత్యం ఎంతకాలం నిలబడుతుందన్నది. మమతా బెనర్జీ వ్యక్తిగత ప్రజాదరణ కూడా పార్టీకి కీలక బలం. ఆమె నాయకత్వం పార్టీ కథనాన్ని బలపరచడమే కాకుండా, అంతర్గత విభజనలను తగ్గించడంలో సహాయపడుతోంది. అయితే, అధికారంలో ఎక్కువ కాలం ఉండటం వల్ల అసంతృప్తి సహజంగానే పెరుగుతుంది. అందుకే అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేయడం, కొత్త తరాన్ని ముందుకు తీసుకురావడం వంటి చర్యలను టీఎంసీ చేపడుతోంది. అయితే ఇవి ఎంతవరకు ప్రభుత్వ వ్యతిరేక భావనను తగ్గిస్తాయన్నది కీలక అంశంగా మారనుంది. బెంగాల్‌లో పార్టీ విస్తరణ ఇప్పటికే రాష్ట్ర రాజకీయ సమీకరణలను మార్చేసింది. అయితే 2021 తర్వాత దాని ప్రస్థానం, పురోగతి కంటే ఎక్కువగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికే పరిమితమైంది. ఉత్తర బెంగాల్ ప్రాంతాల్లో, అలాగే గుర్తింపు రాజకీయాలు, పాలనపై పార్టీ ఇచ్చిన సందేశాలకు స్పందించిన వర్గాల్లో బిజెపికి గట్టి ఓటు బ్యాంక్ ఉంది. అయినప్పటికీ, ఓట్ల వాటాకు, సీట్ల మార్పిడికి మధ్య ఉన్న అంతరం ఒక కీలకమైన అడ్డంకిగా మిగిలిపోయింది. 'ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్' విధానం సంస్థాగత బలహీనతలను మరింత స్పష్టంగా బయట పెడుతోంది. ఈ విషయంలో బిజెపి, టిఎంసిలో పాతుకుపోయిన క్షేత్రస్థాయి యంత్రాంగం కంటే వెనుకబడి ఉంది. బిజెపి ఎదుగుదలకు మరో ముఖ్యమైన అడ్డంకి నాయకత్వ సమస్య. జాతీయ స్థాయి నాయకులు పార్టీకి గుర్తింపు, ఉత్సాహం తీసుకువచ్చినా, మమతా బెనర్జీకి సమానంగా రాష్ట్రస్థాయిలో ప్రభావం చూపగల నాయకుడు లేకపోవడం పార్టీకి పెద్దలోటుగా మారింది. మూడు దశాబ్దాలపాటు ఏకపక్ష ఆధిపత్యం చూపిన వామపక్షాలు, ఇప్పుడు శాసనసభలో దాదాపు కనిపించని స్థితికి చేరాయి. 2021లో వారి సంప్రదాయ మద్దతుదారులు బిజెపి వైపు మళ్లడం, బిజెపి సిద్ధాంతానికి మద్దతు పలకడం కంటే, టిఎంసిని ఓడించాలనే వ్యూహాత్మక నిర్ణయాన్ని ఎక్కువగా భావించాలి. అయితే ఈ విధమైన వ్యూహాత్మక ఓటింగ్ వల్ల ప్రస్తుతం రాజకీయాలు రెండు పార్టీల మధ్యే కేంద్రీకృతమయ్యే పరిస్థితి మరింత బలపడింది. ఇదే పరిస్థితి వామపక్షాల పునరుద్ధరణకు అడ్డంకిగా మారుతోంది. ముఖ్యంగా యువతలో, అలాగే పట్టణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో కొంత మద్దతు కనిపిస్తోంది. చిన్న పోటీల్లో ఓట్ల శాతం క్రమంగా పెరగడం, పడిపోతున్న స్థితి కొంతవరకు స్థిరపడిందని సూచిస్తున్నప్పటికీ, దాని పునరుజ్జీవనానికి ఉన్న నిర్మాణాత్మక అడ్డంకులు మాత్రం చాలా బలంగా ఉన్నాయి. బలమైన నాయకత్వం లేదా కొత్త రాజకీయ దిశ లేకపోతే, వామపక్షాలు అధికారానికి కాకుండా, కేవలం తమ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకోవడానికే పరిమితమయ్యే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది.

హైదరాబాద్
గురువారం
26.03.2026

చివరి అంకమా?.. చెరగని సంకల్పమా?

ఇది ఒక ఐడియాలజీ ఓటమి కాదు – ఒక కాలం ముగింపు. 1967 నుంచి మొదలైన నక్సలిజం, 'ప్రజల యుద్ధం' పేరుతో వేలాది యువకులను, గిరిజనులను ఆకర్షించింది. కానీ ఆధునిక భారతదేశంలో ఆ ఆదర్శాలు పాతవైపోయాయి. అభివృద్ధి, విద్య, ఉపాధి, ప్రజాస్వామ్యం.. ఇవి ఆకర్షణీయంగా మారాయి. ఇది విజయం మాత్రమే కాదు – బాధ్యత కూడా. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధి, ఉపాధి, విద్య, ఆరోగ్యం.. ఇవి స్థిరంగా ఉండాలి. లేకపోతే కొత్త రూపాల్లో అసంతృప్తి తలెత్తవచ్చు. మార్చి 31 తర్వాత ఏమవుతుందో గణపతి నిర్ణయం జవాబు చెబుతుంది. ఆయన లొంగిపోతే.. ఇది శాంతి, అభివృద్ధి యుగం ప్రారంభం. లొంగకపోతే.. ఒక చారిత్రక ఫుట్‌నోట్‌గా మిగిలిపోతాడు. ఏది జరిగినా, భారతదేశం ఒక భారమైన అధ్యాయం నుంచి బయటపడుతోంది. ఇది కేవలం నక్సలిజం ఓటమి కాదు – ప్రజాస్వామ్య విజయం.




కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884

మార్చి 31, 2026... కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టంగా ప్రకటించిన ఈ గడువు భారత దేశ చరిత్రలో నక్సలిజం అధ్యాయానికి చెక్‌మేట్ ఇచ్చే క్షణంగా నిలవబోతోంది. ఫిబ్రవరి 2223, 2026న తెలంగాణ పోలీసుల ముందు జరిగిన భారీ లొంగుబాటు ఈ ప్రక్రియను వేగవంతం చేసింది. మావోయిస్టు అనధికారిక కేంద్ర కమిటీ కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్‌ఛార్జ్ తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్జీ.. 44 ఏళ్లుగా అండర్‌గ్రౌండ్‌లో ఉన్న, బసవరాజు (నంబల కేశవరావు) మరణం తర్వాత పార్టీ అనధికారిక జనరల్ సెక్రటరీగా పని చేసిన ఉన్నత నాయకుడు లొంగిపోయారు. వీరితో పాటు సెంట్రల్ కమిటీ సభ్యుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ (మల్లారాజి రెడ్డి), తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీ బడే చొక్కా రావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్, స్టేట్ కమిటీ సభ్యుడు నూనె నరసింహా రెడ్డి అలియాస్ గంగన్న అలియాస్ సన్నుదాదా, అంతకుముందు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అబయ్, సోను, తక్కల్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న తదితరులు లొంగిపోయారు. వీరితో పాటు వందలాది మంది వరకు దళ సభ్యులు, మధ్యస్థ నాయకులు కూడా ఆయుధాలు పడేశారు. ఇది కేవలం వ్యక్తుల సరెండర్ కాదు - మావోయిస్టు సంస్థ యొక్క ఆఖరి వెన్నెముకను విరగ్గొట్టిన చారిత్రక క్షణం. ఈ లొంగుబాట్లు ఆపరేషన్ కగార్‌లో భాగంగా సెక్యూరిటీ ఫోర్సులు, ఇంటెలిజెన్స్, అభివృద్ధి కార్యక్రమాలు కలిసి సాధించిన ఫలితం. 2025లోనే 2,000కి పైగా మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్జి, సంగ్రామ్ వంటి నాయకుల సరెండర్‌తో సెంట్రల్ కమిటీ దాదాపు కుప్పకూలింది. పార్టీ ఇప్పుడు 'హెడ్‌లెస్, రడర్‌లెస్, లీడర్‌లెస్' అని తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక్కడే ఉత్కంఠ నెలకొంది. మాజీ మావోయిస్టు జనరల్ సెక్రటరీ ముప్పాల లక్ష్మణ రావు అలియాస్ గణపతి. 1970ల నుంచి పీపుల్స్ వార్ ఉద్యమాన్ని నడిపిన, 2004లో సి.పి.ఐ (మావోయిస్టు) ఏకీకరణకు కీలకపాత్ర వహించిన, 2018 వరకు పార్టీని నడిపిన ఈ 77 ఏళ్ల వృద్ధుడు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారు. నేపాల్‌లో ఉన్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులు, మాజీ సహచరులు కూడా ఆయనను లొంగిపోవాలని పిలుస్తున్నారు. ఢిల్లీలో అమిత్ షా ముందు సరెండర్ జరిగే అవకాశం ఉందని వార్తలు.

గణపతి లొంగిపోతే పరిణామాలు ఏమవుతాయి?

ఇది నక్సలిజం యొక్క చివరి అధ్యాయం ముగింపుకు చిహ్నం. గణపతి వంటి ఐకానిక్ ఫిగర్ లొంగిపోవడం ద్వారా మిగిలిన కొద్దిమంది క్యాడర్లు (సెంట్రల్ కమిటీలో 12 మంది మాత్రమే యాక్టివ్‌గా మిగిలి ఉన్నారని సమాచారం) కూడా సరెండర్‌కు ప్రోత్సహితులవుతారు. పార్టీ సంస్థాగతంగా పూర్తిగా కుప్పకూలుతుంది. 'నక్సల్ ఫ్రీ ఇండియా' అనే అమిత్ షా ప్రకటన నిజమవుతుంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఝార్ఖండ్ వంటి ప్రాంతాల్లో మిగిలిన 'లిబరేటెడ్ జోన్లు' పూర్తిగా అంతమవుతాయి. అభివృద్ధి కార్యక్రమాలు, మెయిన్‌స్ట్రీమ్ రాజకీయాలు, ప్రజాస్వామ్యం ఆ ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయి. గణపతి సరెండర్ ఒక సింబాలిక్ మెసేజ్ - 'ఆయుధాలు వదిలి సమాజంలోకి వచ్చేస్తే మార్గం ఉంది' అని. ఇది ఇతర తీవ్రవాద ఉద్యమాలకు కూడా సంకేతం. భారతదేశం ఒక యుగం నుంచి మరొక యుగానికి మారినట్లు.



లొంగిపోకపోతే పరిణామాలు ఏమవుతాయి?

గణపతి వయసు, అనారోగ్యం దృష్ట్యా ఇది ఆచరణీయం కాదు. ఆయన లొంగకపోవడం ఒక సింబాలిక్ రెసిస్టెన్స్‌గా మారవచ్చు - 'విప్లవం ఇంకా జీవించి ఉంది' అని నిరూపించడానికి. కానీ వాస్తవం ఏమిటంటే, ఆయన ఒక్కరే ఏం చేయగలరు? సంస్థ దాదాపు లేదు. క్యాడర్ బలం శూన్యం. సెక్యూరిటీ ఫోర్సుల టెక్నాలజీ, ఇంటెలిజెన్స్, అడవుల్లో అభివృద్ధి - ఇవన్నీ ఆయన అజ్ఞాతవాసాన్ని కష్టతరం చేస్తాయి. కేంద్రం 'తీవ్ర పరిణామాలు' ఉంటాయని స్పష్టం చేసింది. ఆపరేషన్ కాగర్ మరింత తీవ్రమవుతుంది. ఆయనను 'తుదముట్టించడం' లేదా అరెస్టు చేయడం సాధ్యమవుతుంది. ఇది నక్సలిజాన్ని రూపుమాపడానికి బదులు, ఒక వ్యక్తి యొక్క 'లాస్ట్ స్టాండ్'గా చూడవచ్చు. ప్రజలు దీనిని 'వాస్తవాలను అంగీకరించని ఒక వృద్ధ నాయకుడి ఒంటరి పోరాటం'గా చూస్తారు. ఉద్యమం పునరుజ్జీవనం కాదు.. కేవలం ఆలస్యం మాత్రమే.

దీనిని ఎలా చూడాలి?

ఇది ఒక ఐడియాలజీ ఓటమి కాదు - ఒక కాలం ముగింపు. 1967 నుంచి మొదలైన నక్సలిజం, 'ప్రజల యుద్ధం' పేరుతో వేలాది యువకులను, గిరిజనులను ఆకర్షించింది. కానీ ఆధునిక భారతదేశంలో ఆ ఆదర్శాలు పాతవైపోయాయి. అభివృద్ధి, విద్య, ఉపాధి, ప్రజాస్వామ్యం.. ఇవి ఆకర్షణీయంగా మారాయి. సెక్యూరిటీ ఆపరేషన్లు, సరెండర్ పాలసీలు, రోడ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు కలిసి ఉద్యమాన్ని బలహీనపరిచాయి. గణపతి లొంగుబాటు లేదా ఆయన తర్వాతి పరిణామాలు ఈ మార్పును ధృవీకరిస్తాయి. ఇది విజయం మాత్రమే కాదు - బాధ్యత కూడా. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధి, ఉపాధి, విద్య, ఆరోగ్యం - ఇవి స్థిరంగా ఉండాలి. లేకపోతే కొత్త రూపాల్లో అసంతృప్తి తలెత్తవచ్చు. మార్చి 31 తర్వాత ఏమవుతుందో గణపతి నిర్ణయం జవాబు చెబుతుంది. ఆయన లొంగిపోతే.. ఇది శాంతి, అభివృద్ధి యుగం ప్రారంభం. లొంగకపోతే.. ఒక చారిత్రక ఫుట్‌నోట్‌గా మిగిలిపోతాడు. ఏది జరిగినా, భారతదేశం ఒక భారమైన అధ్యాయం నుంచి బయటపడుతోంది. ఇది కేవలం నక్సలిజం ఓటమి కాదు - ప్రజాస్వామ్య విజయం.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

గరికపాటికి పిల్లల భోజనంపై అసహనం ఎందుకు?



సంపతి రమేష్
7989579428

భారతదేశం చారిత్రకంగా అసమానతలతో నిర్మితమైన సమాజం. కులవ్యవస్థ ఆధారంగా విద్య, వనరులు, అవకాశాలు కొన్ని వర్గాలకే పరిమితమయ్యాయి. ముఖ్యంగా దళితులు, బహుజన వర్గాలు శతాబ్దాల పాటు విద్యకు దూరమయ్యాయి. అస్పృశ్యత, అంటరానితనం వంటి అమానుష శిక్షలతో వారు సామాజికం, విద్యాపరంగానూ వెనుకబడ్డారు. భారత రాజ్యాంగం ఒక విప్లవాత్మక మార్పుకు దారి తీసింది. రాజ్యాంగం ఆర్టికల్ 21A ద్వారా విద్యను హక్కుగా గుర్తించింది. ఆర్టికల్ 46 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఇప్పటికి వాస్తవ పరిస్థితి ఏమిటంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అక్షరాస్యత రేటు అగ్రవర్ణాలతో పోలిస్తే తక్కువగానే ఉంది. ఇది చారిత్రక వెనుకబాటుతనానికి ప్రతిబింబం. ఈ వెనుకబాటును సరిచేసే క్రమంలో మరిన్ని చర్యలు చేపట్టడం జరుగుతుంది. ఇందులో భాగంగా విద్యా హక్కు చట్టం, మధ్యాహ్న భోజనం ద్వారా విద్య, పోషకార భద్రతకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గరికపాటి వంటి ప్రవచనకర్త మధ్యాహ్నం భోజనం ఎందుకని, గుడ్డు ఎందుకని, శోభనంలో పెళ్ళికొడుకు వంటి మాటలు మధ్యాహ్న భోజనంపై తన అక్కసును వ్యక్తం చేశాడు. ఈ మాటలు బీసీ ఎస్సీ ఎస్టీ పిల్లలను అవమానించినట్టే. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రాన్ని పరిశీలిస్తే దాదాపు 92 శాతం విద్యార్థులు బీసీ ఎస్సీ ఎస్టీలు ప్రభుత్వ పాఠశాల చదువుతున్నారు. కేవలం 8 శాతం మాత్రమే అగ్రకులాలు విద్యనభ్యసిస్తున్నారు. మెజార్టీ విద్యార్థుల అవమానించినట్టు కాదా? భారతదేశంలో సరిపడ ఆహారం ఉన్న పౌష్టికాహార భద్రత లేదు. పౌష్టికాహారం లోపం వల్ల కోట్లాది బాలలు అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిశోధన అనంతరం పిల్లల పౌష్టికార భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలో వారానికి మూడు రోజులు గుడ్డు పెడుతున్నారు. గుడ్డు పౌష్టికాహారం. కానీ గరికపాటి ప్రభుత్వ పాఠశాల పిల్లలకు గుడ్డు ఇవ్వడంపై మాట్లాడడం నిరుపేదలకు చదువును, ఆహారాన్ని దూరం చేసే కుట్రగా చెప్పవచ్చు.

మధ్యాహ్నం భోజనం హక్కు

మధ్యాహ్న భోజనం పథకం చట్టపరంగా, రాజ్యాంగ పరంగా బలమైన పునాది కలిగి ఉంది. భారతదేశంలో మధ్యాహ్న భోజన పథకం ఆరంభం స్వాతంత్ర్యానికి ముందే కొన్ని ప్రాంతాలలో కనిపించినా, వ్యవస్థీకృతంగా ఇది తమిళనాడు రాష్ట్రంలో 1960లలో ప్రారంభమైంది. తరువాత ఇది దేశవ్యాప్తంగా విస్తరించింది. 1995 ఆగస్టు 15న కేంద్ర ప్రభుత్వం "నేషనల్ ప్రోగ్రాం ఆఫ్ న్యూట్రిషనల్ సపోర్ట్ టు ప్రైమరీ ఎడ్యుకేషన్ పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించింది. 2001 సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు



అన్ని రాష్ట్రాల ప్రతి ప్రభుత్వ పాఠశాల పిల్లలకు వండిన వేడి భోజనం తప్పనిసరి అని, ఇది హక్కుగా పేర్కొన్నది. ఈ పథకం 1వ నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు వర్తింపచేశారు. ప్రస్తుతం ఇది పీఎం పోషణ్ పేరిట కొనసాగుతోంది. ఇదీ ఆహార భద్రత చట్టంలోనీ భాగం. మధ్యాహ్నం భోజనం అమలు ద్వారా పేద కుటుంబాల పిల్లలు పాఠశాలకు రావడానికి ప్రోత్సాహం లభించింది. హాజరు, నమోదు శాతం పెరిగింది. అక్షరాస్యత, విద్యాభివృద్ధికి బాటలు పడ్డాయి. పిల్లలలో పోషకాహార లోపం తగ్గింది. ఆరోగ్యం, శారీరక అభివృద్ధి మెరుగుపడింది. తరగతి గది ఆకలిని తగ్గించింది. వివిధ కులాలు, వర్గాల పిల్లలు కలిసి భోజనం చేయడం ద్వారా సమానత్వ భావన పెరిగింది. ఈ పథకం పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు దీర్ఘకాల ప్రయోజనం కలిగిస్తుందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. వంట కార్మికులుగా మహిళలకు ఉపాధి అవకాశాలు కలిగిస్తుంది. నేడు మధ్యాహ్న భోజన పథకం కేవలం సంక్షేమ కార్యక్రమం కాకుండా చట్టపరమైన హక్కుగా గుర్తించబడింది. విద్య హక్కు చట్టం 2009, 6-14 సంవత్సరాల పిల్లలకు ఉచిత, తప్పనిసరి విద్య విద్యలో భాగంగా పోషకాహారం కూడా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది. జాతీయ ఆహార భద్రతా చట్టం 2013 పాఠశాల విద్యార్థులకు పోషకాహారం భద్రతను కల్పిస్తుంది. ఇలాంటి పథకం అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం అమలవుతుంది.

గరికపాటి మాటలు వెనక్కితీసుకోవాలి.

జీవించే హక్కు భారత రాజ్యాంగంలోని అత్యున్నతమైన హక్కు. ఇందులో భాగంగానే అందరికీ విద్య, మధ్యాహ్నం భోజనం కార్యక్రమం అమలవుతుంది. ఈ క్రమంలో గరికపాటి మాటలు సమాజాన్ని తప్పు దోవపట్టించే విధంగా ఉన్నాయి. విద్య నాణ్యత గురించి మాట్లాడడం తప్పుకాదు. కానీ పిల్లలు అన్నం కోసమే బడికి వస్తున్నట్లు, వారికి కోడి గుడ్డు ఇవ్వడం పట్ల హేళన చేయడం సరికాదు. ఇలాంటి అనుచిత వాక్యాలు చేయడం పట్ల ఉభయ తెలుగు రాష్ట్రాల మేధావులు, ఉపాధ్యాయ , విద్యార్థి సంఘాలు ఖండిస్తున్నారు. అన్ని దానాల కన్నా అన్నదానం ముఖ్యమని మన సంస్కృతి, ధార్మిక గ్రంధాలు చెబుతున్నాయి. "ఆకలి తీర్చినపుడే విద్య పుష్టిగా పెరుగుతుంది" —— ఈ సూత్రంతో మధ్యాహ్న భోజనం బలోపేతా కృషి చేయాలి. కానీ దాన్ని నిర్వీర్యం చేసే విధంగా మాట్లాడిన తీరు ఆక్షేపనీయం. మధ్యాహ్నం భోజన కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇంటర్మీడియట్ వరకు విస్తరించబోతుంది. క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా లోపాల ఉండవచ్చు. ఈ లోపాలను సవరించడానికి సరిపడ బడ్జెట్ కేటాయింపులు జరగాలి. ఉపాధ్యాయులపై భారం పడకుండా స్వతంత్ర్య వ్యవస్థను ఏర్పాటుచేసి అమలుచేయాలనీ సూచించాలి. కానీ ప్రవచనకర్త మాటలు బీసీ ఎస్సీ ఎస్టీ పిల్లలను అక్కసుతో అవమానించినట్లున్నాయి. అగ్రకుల తత్వానికి తార్కాణం. ఇలాంటి వాక్యాలు ఒక అట్టడుగు కులం వ్యక్తి మాట్లాడితే సమాజ స్పందన మరో విధంగా ఉండేదేమో?. దళిత ఎమ్మెల్యే మందుల సామెల్ పై దాడి ఇందుకు నిదర్శనమే. గరికపాటి మాటలు రాజ్యాంగాన్ని, చట్టాన్నీ కూడా అవమానించినట్లు. కావున తన మాటలను వెనక్కితీసుకొని, క్షమాపణ చెప్పాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)



మహిళా రిజర్వేషన్లు – సమానత్వ దిశగా మరో అడుగు,

కానీ, సబ్ కోటా అవసరం మరింత కీలకం



భవానీ వేముల
8297444333

భారతదేశ ప్రజాస్వామ్యంలో మహిళల ప్రతినిధిత్వం పెంపు కోసం దశాబ్దాలుగా కొనసాగుతున్న పోరాటం ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్న లక్ష్యం సాధన దిశగా దేశం ముందుకు సాగుతోంది. ఇది భారతీయ మహిళల ఎన్నో ఏళ్ల కల. కానీ ఈ కల నిజమయ్యే వేళలో సమానత్వం పూర్తిగా సాధ్యమవ్వాలంటే ఒక ముఖ్యమైన అంశాన్ని విస్మరించరాదు.. అదే మహిళా కోటాలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా.తెలంగాణ జాగృతి వంటి సంస్థలు ఈ అంశంపై దీర్ఘకాలంగా అవిశ్రాంతంగా పోరాటం చేస్తున్నాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా నిరాహార దీక్షలు నిర్వహించడం, దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడం, ఆల్ పార్టీ మీటింగ్స్ నిర్వహించడం వంటి చర్యలు ఈ పోరాటానికి స్పష్టమైన ఉదాహరణలు. ఈ ఉద్యమం కేవలం రిజర్వేషన్ల కోసం మాత్రమే కాకుండా, సమాన న్యాయం కోసం సాగుతోంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఎంతో అవసరమనే విషయం అందరికీ స్పష్టమే. కానీ ఈ రిజర్వేషన్లలో అన్ని వర్గాల మహిళలకు సమాన అవకాశాలు లభిస్తున్నాయా అనే ప్రశ్న మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఓబీసీ వర్గాలకు చెందిన మహిళలు రాజకీయ రంగంలోకి రావడానికి ఇప్పటికీ అనేక అవరోధాలను ఎదుర్కొంటున్నారు. అందుకే మహిళా కోటాలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా ఉండాలని డిమాండ్ బలంగా వినిపిస్తోంది. సబ్ కోటా లేకుండా మహిళా రిజర్వేషన్లు అమలులోకి వస్తే, ప్రధానంగా అభివృద్ధి చెందిన వర్గాలకు చెందిన మహిళలకే అవకాశాలు ఎక్కువగా దక్కే ప్రమాదం ఉంది. దీని వల్ల అసలు లక్ష్యం... అన్ని వర్గాల మహిళల సాధికారత... పూర్తిగా నెరవేరదు. సమాజంలో ఉన్న అసమానతలు అలాగే కొనసాగుతాయి. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడం ఎంత ముఖ్యమో, అందులో సబ్ కోటాలను సముచితంగా కల్పించడం కూడా అంతే ముఖ్యమైనది. ఓబీసీ మహిళలకు ప్రత్యేక భాగస్వామ్యం కల్పించడం ద్వారా మాత్రమే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో మహిళా ఉద్యమాలు మరోసారి గళమెత్తుతున్నాయి. మహిళా కోటాలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలన్న డిమాండ్ కేవలం ఒక వర్గం కోసం కాదు, భారతీయ ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రంగా, సమానత్వంతో నింపే ప్రయత్నం. సమాన హక్కులు - సమాన అవకాశాలు - అదే నిజమైన ప్రజాస్వామ్యం.

(వ్యాసకర్త తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ఆర్టీసీని మరింత విస్తరించే దిశగా చర్యలు

- హైదరాబాద్ పాటు గ్రామలకు కనెక్టివిటీ పెంపు
- ఆర్టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులుతో మంత్రి పొన్నం ముఖాముఖి
- నల్గొండ జిల్లా నుండి పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 25: మహాలక్ష్మీ పథకం తో పెరుగుతున్న రద్దీతో ఆర్టీసీ మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకుంది. ఇందుకోసం మూడు రోజుల పాటు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో అసెంబ్లీ కమిటీ హాల్ 1 లో ఉమ్మడి జిల్లాల వారీగా ఇంచార్జి మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో, ఆర్టీసీ ఎండీ, ఈడీలు, ఆర్ఎంలు ఉన్నతాధికారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న సమావేశంలో తొలి రోజు ఉమ్మడి నల్గొండ, మెదక్, రంగారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల ప్రజా ప్రతినిధులు వారి నియోజక వర్గాల్లో ఉన్న సమస్యలపై ఆర్టీసీ అధికారుల సమక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలు ఆర్టీసీ అధికారులు నివేదిక రూపొందిస్తున్నారు. నల్గొండ జిల్లా నుండి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బాలు నాయక్, జయవీర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహాలక్ష్మీ పథకం విజయవంతంగా కొనసాగుతుందని, ప్రపంచంలోనే ఆర్టీసీకి గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. రాష్ట్రంలో అవసరమైన నూతన బస్సుల కొనుగోలు, కొత్త రూట్లలో బస్సులు నడపడం, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కు అండగా ఉంటామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై ఆర్టీసీ అధికారులు నోట్ చేసుకొని నివేదిక రూపొందించనున్నారు. సమస్యల పరిష్కారం పై చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి , ఉమ్మడి నల్గొండ, మెదక్, రంగారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



భావి భారత నిర్మాతలుగా ఎదగాలి

- డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి
- జేబీ ఇన్‌స్టిట్యూషన్స్ 'ఇంక్స్ -2026' వేడుకలు
- నేత్ర విద్యాలయ క్రీడాకారులకు స్వర్ణ పతకాలు, నగదు పురస్కారాలు

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 25 : దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషించాలని, విద్యార్థులు ఆవిష్కరణలు, పరిశోధనల దిశగా అడుగులు వేయాలని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్, జాతీయ భద్రతా సలహా మండలి సభ్యులు డాక్టర్ జి. సతీష్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని జె.బి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో జె.బి. గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ ఆలోచనా విధానంతోనే సాంకేతిక పురోగతి సాధ్యమవుతుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన చెవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. బసవ తారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి. సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ సేవా దృక్పథం, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా నేత్ర విద్యాలయ జూనియర్ , డిగ్రీ కళాశాలకు చెందిన 12 మంది దృష్టి లోపం ఉన్న క్రీడాకారులను యాజమాన్యం ప్రత్యేకంగా సత్కరించింది. వారి పట్టుదలకు గుర్తింపుగా ఒక్కొక్కరికి రూ. 12 వేల నగదు పురస్కారంతో పాటు బంగారు పతకాలను అందజేశారు. అలాగే అకాడమిక్, స్పోర్ట్స్ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు.జె.బి. ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జె.వి. కృష్ణారావు మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యతో పాటు యువ ప్రతిభను ప్రోత్సహించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెబిఐఇటి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సి. కృష్ణమాచారి, డైరెక్టర్ డాక్టర్ సి. సంజయ్, వివిధ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేయించాలి

- అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుభాష్

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 25: పశువులకు ప్రాణాంతకమైన గాలికుంటు వ్యాధి నివారణకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుభాష్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 116 పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఏడీ సుభాష్ మాట్లాడుతూ.. ఆఫ్తో వైరస్ కారణంగా సోకే ఈ వ్యాధి వల్ల పశువులకు తీవ్ర జ్వరం రావడమే కాకుండా నోరు, కాళ్లలో పుండ్లు ఏర్పడతాయని వివరించారు. దీనివల్ల పశువులు మేత తినలేక, నడవలేక ఇబ్బంది పడతాయని, ఫలితంగా పాల ఉత్పత్తి తగ్గి రైతులకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లుతుందని తెలిపారు. 3 నెలలు దాటిన ప్రతి ఆవు, గేదె జాతి పశువుకు ఈ టీకా వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అప్పూపూర్ పశువైద్యాధికారి డాక్టర్ దేవిరెడ్డి బాకారం సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఉపసర్పంచ్ సుభాష్ రెడ్డి, వార్డు సభ్యులు, పశువైద్య సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల భవిష్యత్తుకు 'గరుగు' భరోసా

- సొంత ఖర్చుతో పదో తరగతి విద్యార్థులకు గణిత ఉపాధ్యాయుడి నియామకం
- ఉపాధ్యాయుడికి వేతనం అందజేసిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ గరుగు రాజు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 25 : విద్యార్థుల విద్యా భవిష్యత్తు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో మొయినాబాద్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గరుగు రాజు తన ఉదారతను చాటుకున్నారు. హిమాయత్‌నగర్ జెడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఆరు నెలల క్రితం పదోన్నతిపై వెళ్లడంతో, పదో తరగతి విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన గుర్తించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులకు నష్టం జరగకూడదని భావించిన ఆయన, జీ ఆర్ ఫౌండేషన్ తరపున ప్రత్యేకంగా మహేందర్ అనే ప్రైవేట్ గణిత ఉపాధ్యాయుడిని నియమించారు. నియమించిన ఉపాధ్యాయుడికి బుధవారం తన సొంత డబ్బులతో గరుగు రాజు వేతనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులే దేశ భవిష్యత్తుకు దిక్సూచి అని, వారికి నాణ్యమైన విద్య అందాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు జులేక సుల్తానా, ఎస్ఎంసి ఛైర్మన్ మహేశ్వరి, నాయకులు చదువు రామచందర్, ఉపాధ్యాయులు రాములు, అరుణ, శైలజ, భాగ్యలక్ష్మి, సుమిత్ర, సుగుణ, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా తూర్పు భరత్ సాయి రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 25: టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుమారుడు తూర్పు భరత్ సాయి రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం సంగారెడ్డి లో ఘనంగా జరిగాయి. టీబిఆర్ యువసేన, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్ ల ఆధ్వర్యంలో ఈ బర్త్ డే వేడుకలు నిర్వహించారు. భరత్ సాయి రెడ్డి కి శాలువాలు కప్పి, బొకెలు అందించి శుభాకాంక్షలు అందజేశారు. బాణాసంచా కాల్చి తమ యువనేత జన్మదినం సందర్భంగా సంబురాలు. నిర్వహించారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులకు భరత్ సాయి రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్ , కిరణ్ గౌడ్, వెంకట్ రాజు, మహేష్ లతో పాటు కౌన్సిలర్ లు తోపాజి హరీష్, శ్రీశైలం, ప్రసాద్, రమేష్ , కిరణ్, ఫయాజ్, అశ్విన్, శైలేందర్ రెడ్డి, సతీష్, ప్రశాంత్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా మెడికల్ కాలేజీని కందుకూరులోనే కొనసాగించాలి

- కందుకూరులోనే కొనసాగించాలి
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి25: రంగారెడ్డి జిల్లాకు కేటాయించిన మెడికల్ కాలేజీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర ప్రాంతాలకు మార్చకుండా కందుకూరులోనే కొనసాగించాలని మహేశ్వరం ఎమ్మెల్యే,మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అసెంబ్లీలో డిమాండ్ చేశారు.ప్రశ్నోత్తరాల సమయంలో వైద్యారోగ్య శాఖపై జరిగిన చర్చలో సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ,గతంలో కేసీఆర్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాకు ప్రత్యేకంగా మెడికల్ కాలేజీని మంజూరు చేసి,కందుకూరులో ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గుర్తుచేశారు.ప్రస్తుతం ఆ మెడికల్ కాలేజీని ఎల్బీనగర్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని,ఇది గ్రామీణ ప్రాంత ప్రజలకు అన్యాయం అవుతుందని పేర్కొన్నారు. శ్రీశైలం హైవేపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను ప్రస్తావిస్తూ,ప్రమాదాల సమయంలో తక్షణ వైద్యసేవలు అందుబాటులో లేకపోవడం వల్ల బాధితులు హైదరాబాద్ చేరుకునేలోపే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.మహేశ్వరం, కందుకూరు,ఇబ్రహీంపట్నం,యాచారం ప్రాంతాలకు మెడికల్ కాలేజీ వస్తే 400 పడకల ఆసుపత్రి ఏర్పడి,చుట్టుపక్కల గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని వివరించారు. ఇప్పటికే కందుకూరులో స్థలం కేటాయించి,గతంలో హరీష్ రావు చేతుల మీదుగా ఫౌండేషన్ కూడా వేసిన విషయాన్ని గుర్తు చేస్తూ,ఈ ప్రాజెక్టును అక్కడే కొనసాగించాలని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.





రేగడి ఘనాపూర్‌లో డీపీవో పర్యటన

ప్రతిపక్షం,చేవెళ్ల, మార్చి 25 : చేవెళ్ళ మండలం రేగడి ఘనాపూర్ గ్రామపంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ బుధవారం పర్యటించారు. గ్రామమంలో డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, నర్సరీ సందర్శించి అభివృద్ధికి సూచనలు చేశారు. ఈయొక్క కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ తిప్పని మాధవి రాంరెడ్డి, ఉప సర్పంచ్ ఈదులపల్లి మహేశ్వరి రాములు వార్డ్ మెంబెర్స్ పాల్గొన్నారు.



పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లలో కబ్జాదారులు

- అమాయకులను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం
- హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ హెచ్చరిక

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 25 : పాటి ఘనపూర్ లోని ఆనంద్ నగర్ ప్లాట్లను కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ భరోసా ఇచ్చారు. పైసా పైసా కూడబెట్టి కొనుగోలు చేసిన ప్లాట్లలో కబ్జాదారులు చొరబడి అమాయకులను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు.సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాటి ఘనాపూర్ గ్రామంలోని ఆనంద్ నగర్ కాలనీలో హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్ పర్యటించారు . పాటి సర్వే నంబర్ 185,186,187,239,243,245,246,247 నుంచి 250 లలో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు విజయ్ , శ్యామ్ తదితరులు ప్రజావాణిలో హైడ్రాకు చేసిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏ.వీ రంగనాథ్, అధికారుల బృందం భూమిని పరిశీలించారు. ఆనంద్ నగర్ ప్లాట్లను కొనుగోలు చేసిన బాధితులను కలిసిన హైడ్రా అధికారులు అక్కడి ప్లాట్లు, కబ్జా సమస్యపై ఆరా తీశారు. ప్లాట్ల ఓనర్లకు న్యాయం చేస్తామని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ భరోసా ఇచ్చారు.

14–15 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 25 : గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో కీలకమైన హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను జిల్లాలోని 14-15 సంవత్సరాల బాలికలందరికీ మిషన్ మోడ్‌లో అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వైద్య అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ వైద్యశాఖ అధికారులతో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అమలు, మహిళా స్వయం సహాయక సంఘాల హెల్త్ ప్రొఫైల్, డిజిటల్ హెల్త్ ప్రొఫైల్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను 14-15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలందరికీ తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి డీఆర్‌డీఏ, మెప్మా, డీఈఓలతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, బాలికలను సమీప పీహెచ్‌సీలకు తీసుకువచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని అర్హులైన అందరు బాలికలకు మిషన్ మోడ్‌లో వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో స్పెషలిస్ట్ డాక్టర్లతో నిర్వహించిన క్యాంపులు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో టీవీపీ స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా నిర్వహించిన స్క్రీనింగ్ కార్యక్రమాల వివరాలను వైద్య అధికారులు కలెక్టర్‌కు వివరించారు. స్క్రీనింగ్ సమయంలో గుర్తించిన అనుమానాస్పద కేసులను తదుపరి పరీక్షలు, చికిత్స కోసం రిఫర్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఒక పీహెచ్‌సీ/యూపీహెచ్‌సీలో స్పెషలిస్ట్ డాక్టర్లతో స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు, రోజుకు 9 రెసిడెన్షియల్ పాఠశాలల్లో టీవీపీ స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆర్‌బీఎస్‌కే బృందాలు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళల హెల్త్ ప్రొఫైల్ అమలుకు సంబంధించి పూర్తి కార్యాచరణ ప్రణాళికతో షెడ్యూల్ సిద్ధం చేయాలని డీఆర్‌డీఓఏ అధికారులకు ఆదేశించారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు అవసరమైన మౌలిక వసతులు, ఇంటర్నెట్ సదుపాయం, నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓఏ జ్యోతి, అడిషనల్ పీడీ సూర్యారావు, డీసీహెచ్ఎస్ కవిత, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీఎస్ఈలో రావి దీప్తికి పీహెచ్‌డీ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 25 : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని రావి దీప్తి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'వాహనాల ఇంటర్నెట్ లోకి తెలివిగా చొరబడటాన్ని గుర్తించే వ్యవస్థ (స్మార్ట్ ఇంట్రూషన్ డిటెక్షన్ సిస్టమ్) కోసం సమర్థవంతమైన అభ్యాసఆధారిత విధానం'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.హిమబిందు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ దీప్తి పరిశోధన, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ వెహికల్స్ (ఐవోవీ) పర్యావరణ వ్యవస్థలో చొరబాటు గుర్తింపు విధానాలను బలోపేతం చేయడానికి రూపొందించిన వినూత్న అభ్యాసఆధారిత ఫ్రేమ్ వర్కును అందిస్తుందని తెలిపారు. సైబర్ బెదిరింపులను గుర్తించడానికి, నిరోధించడానికి అధునాతన మెషిన్ లెర్నింగ్ పద్ధతులను అన్వయించడం ద్వారా అనుసంధానించిన వాహన నెట్ వర్కుల భద్రత, విశ్వసనీయత, సామర్థ్యాన్ని పెంచడం ఈ అధ్యయనం లక్ష్యమన్నారు. స్మార్ట్ ట్రాన్స్ పోర్టేషన్ సిస్టమ్ లలో సైబర్ సెక్యూరిటీ యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతను ఈ పరిశోధన ప్రముఖంగా ప్రస్తావిస్తోందని తెలిపారు. సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే తెలివైన చలనశీల మౌలిక సదుపాయాలు (మొబిలిటీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్లను) నిర్మించడంపై విలువైన అవగాహనను కల్పిస్తుందన్నారు. డాక్టర్ దీప్తి సిద్ధాంత వ్యాసం పీ హెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ షేక్ మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరిశోధనలో, వృత్తి పరంగా ఆమె మరిన్ని విజయాలను సాధించాలని వారు అభిలషించారు.





తలకిందులుగా తపస్సు చేసినా రేవంత్ మళ్లీ సీఎం కాలేడు. ఏ టైమ్‌లో గోల్ కొట్టాలో మాకు బాగా తెలుసు. వచ్చే ఎన్నికల్లో గోల్ కొట్టేది మేమే. ఎలక్షన్ ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే గెలుపు. సిద్దిపేటలో పోటీకి ఎవరినో పెట్టడం ఎందుకు రేవంత్ రెడ్డే రావచ్చు. అసెంబ్లీ నిర్వహణలో ప్రభుత్వం విఫలమైంది. ప్రజాసమస్యలపై చర్చే లేదు.
- మాజీ మంత్రి హరీశ్

ప్రాంతీయం

నిజామాబాద్ అర్బన్‌లో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదు

- పూర్తయి నాలుగేళ్లయిన కేటాయించలేదు
- అసెంబ్లీ లో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 25 : నిజామాబాద్ అర్బన్ లో గత తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ అందించలేదని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూంపై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇవ్వడం లేదు. ఇందూరు నాగారం ప్రాంతంలో 396 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి నాలుగున్నర సంవత్సరాలు గడిచిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకులు కమిషన్లు తీసుకున్నారు కానీ, ఒక్క ఇల్లు కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. ఏళ్లుగా వృధాగా ఉండటంతో ఇళ్ల తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయని, పలు వస్తువులు చోరీకి గురయ్యాయని చెప్పారు. అనేకసార్లు మంత్రులకు విన్నవించడంతో మరమ్మతుల కోసం 1.25 కోట్లు విడుదల చేశారని, కానీ ఇళ్లు మాత్రం కేటాయించలేదన్నారు. అనవసరంగా ప్రజాధనం వృధా అవుతుందని చెప్పారు. అలాగే కలెక్టరేట్ సమీపంలో 200 డబుల్ బెడ్రూం ఇళ్లు 80 శాతం పూర్తి చేసుకున్నాయని, మరో 2 కోట్లు మంజూరు చేస్తే పూర్తవుతాయన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో వివిధ దశల్లో ఉన్న మరి కొన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు మరో రూ.3 కోట్లు కేటాయిస్తే సుమారుగా వేయి ఇళ్లు పూర్తవుతాయన్నారు. అలాగే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా స్థలంతో పాటు రూ. 5 లక్షలు ఇస్తామని చెప్పి మొదటి సంవత్సరం ఒక్కటి కూడా అందించలేదన్నారు. ఇక రెండో సంవత్సరం స్థలం ఉన్నవారికి ఐదు లక్షల అందిస్తామని చెప్పారు కానీ, నిజామాబాద్ అర్బన్ లో స్థలం ఉన్న పేదవారు చాలా తక్కువ మంది ఉంటారని, వారు స్థలం కొనుగోలు చేయాలంటే ఖర్చుతో కూడుకున్నదని తెలిపారు. కావున ప్రభుత్వ స్థలం చూయించి, అర్హులకు ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించాలని కోరారు.

ఉపాధి పనులపై కలెక్టర్ సమీక్ష



ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 26 : హనుమకొండ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన వివిధ పనులు వాటి పురోగతిపై జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఉపాధి హామీ పనులు బిల్లుల చెల్లింపు తదితర అంశాలను గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు. ఉపాధి హామీ పనుల వ్యయం సంబంధించి కలెక్టర్ అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో డిఆర్డివో మేన శ్రీను పంచాయతీరాజ్ ఈఈ సైదుల్ రెడ్డి డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సంతల వేలం ఈ నెల 31కి వాయిదా

ప్రతిపక్షం, పరకాల, మార్చి 25: పరకాల పురపాలక సంఘం పరిధిలోని తైబజార్, పశువుల సంత మరియు గొర్రెలు, మేకల సంతల బహిరంగ వేలం ప్రక్రియ బుధవారం వాయిదా పడింది. 202627 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెట్ రుసుము వసూలు చేసుకునే లీజు హక్కుల కోసం కమిషనర్ ఆధ్వర్యంలో రెండోసారి వేలం నిర్వహించగా, తైబజార్ సంతకు సంబంధించి ఇద్దరు డిపాజిట్లు సమర్పించినప్పటికీ వేలం సమయానికి కేవలం ఒక్కరే హాజరయ్యారు. అదేవిధంగా పశువుల సంత, గొర్రెలు మరియు మేకల సంతలకు ఎవరూ డిపాజిట్లు సమర్పించకపోవడంతో అధికారులు వేలం ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఈ నెల 31వ తేదీ మంగళవారం ఉదయం 11:00 గంటలకు ఈ సంతల వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 2,00,000/ డి.డి, రూ. 5,00,000/ విలువ గల ఇంటి వాల్యుయేషన్ సర్టిఫికేట్, (9) చెక్కులు మరియు రూ. 2,500/ షెడ్యూల్డ్ ఫారం రుసుమును చెల్లించి, మార్చి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.



జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 25 : ఇటీవల జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులుగా నియమింపబడిన సభ్యులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి కాంగ్రెస్ భవన్లో నియమాక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన జిల్లా కార్యవర్గ సభ్యులకు నగేష్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీలో చోటు లభించడం అనేది సులువైన విషయం కాదని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన మీ అందరికీ పదవులు రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కార్యవర్గంలో చోటు దక్కించుకున్న ఉపాధ్యక్షులు, కోశాధికారి, అధికార ప్రతినిధులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు ఇప్పటినుండి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసి రాబోయే జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రతి మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేలా కృషి చేయాలని సూచించారు. జిల్లా కమిటీలో అన్ని వర్గాలకు సంబంధించిన వ్యక్తులకు స్థానం కల్పించడం జరిగిందని, కమిటీలో ఉన్న ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత మన పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం భక్తవస్తలం, కౌడపు శరత్, గోళ్ళ ఎర్రన్న, ప్రవీణ్ కుమార్ గౌడ్,జయ లలిత,పైసా ఎల్లయ్య, పవన్ కుమార్, ముస్కు వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ పోటా పోటీగా సంత వేలం



ప్రతిపక్షం, బాన్సువాడ, మార్చి 25: బాన్సువాడ మున్సిపల్లో పరిధిలో వారంతపు సంత, మేకల సంత, రోజువారి సంతకు బుధవారం వేలంపాట నిర్వహించగా కాంట్రాక్టర్లు పోటా పోటీ గా వేలం పాడారు. మేకల సంతకు భారీ ధర పలుకగా రూ.48.10 లక్షలకు ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ సంతల నిర్వహణకు సంబంధించి బుధవారం భారీ ఎత్తున వేలం పాటలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం ప్రక్రియను మున్సిపల్ చైర్మన్ కాసుల విజయ, వైస్ చైర్మన్ ఏజాజ్ రేష్మ బేగం, కౌన్సిలర్లు హకీం, నందకిశోర్, రమేష్ తదితరులు దగ్గరుండి పర్యవేక్షించారు. మేకల సంత వేలంలో అత్యధికంగా మేకల సంత వేలం పాట భారీ ధరకు అమ్ముడైంది. షేక్ ఖదీర్ పాషా రూ. 48.10 లక్షలకు ఈ సంతను దక్కించుకున్నారు. వారపు సంత వేలం నిర్వహణ హక్కులను నాటకారి రాజేష్ రూ. 12.51 లక్షలకు పాడుకున్నారు. రోజువారీ సంత వేలం పాటను ప్రీతమ్ రెడ్డి రూ. 9.10 లక్షలకు దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

పాలిటెక్నిక్ కళాశాలలను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 25 : ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఊతమందించే పాలిటెక్నిక్ కళాశాలను విద్యార్థిని, విద్యార్థులు, యువత పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి బుధవారం ఆయన నవీపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించారు. అందుబాటులో ఉన్న సదుపాయాలు, బోధన, బోధనేతర సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. యువతకు తక్షణ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలనే తపనతో ఉద్దేశ్యంతో జిల్లాలో విరివిగా పాలిటెక్నిక్ కాలేజీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే విద్యార్థులు తగిన విధంగా ప్రవేశాలు పొందడం లేదని, ఈ కళాశాల గురించి విస్తృత స్థాయిలో అవగాహన పెంపొందించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గడిచిన నాలుగు సంవత్సరాల నుండి పాలిటెక్నిక్ కోర్సులు చేసిన అనేక మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని గుర్తు చేశారు. ప్రస్తుతం నవీపేట కళాశాలలో సివిల్, మెకానికల్ విభాగాలు కొనసాగుతున్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నుండి రోబోటిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు సైతం అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువత వినియోగించుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా స్థానిక విలేఖరులతో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి తలెత్తకుండా, ప్రజలకు వారి అవసరాలకు సరిపడా శుద్ధి జలాలు సరఫరా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను సన్నద్ధం చేశామని అన్నారు. ప్రజలు కూడా సకాలంలో మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు పన్నులు చెల్లిస్తూ సదుపాయాలను మెరుగుపరచేందుకు సహకరించాలని కోరారు. ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నామని, కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై నిఘా ఉంచాలని సంబంధిత శాఖలకు సూచించామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు వీలుగా లబ్దిదారులకు అవసరమైన తోడ్పాటును అందిస్తున్నామని, ఇసుక, మొరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు కలిపి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రభుత్వం కేటాయించినందున, అనువైన స్థలం కోసం పరిశీలన జరుపుతున్నామని, ఈ ప్రాంత రైతాంగ ప్రయోజనాల కోసం సాధ్యమైనంత త్వరగా ఫ్యాక్టరీని ఏర్పాటయ్యేలా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ సలహాదారు వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, సందీప్ తదితరులు ఉన్నారు.

కన్వేయర్ బెల్ట్ నిర్వాసిత రైతులతో చర్చలకు కమిటీ

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రతిపక్షం ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి, మార్చి 25: తాడిచర్ల నుండి కేటీపీపీ వరకు ఏర్పాటు చేయనున్న కన్వేయర్ బెల్ట్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులతో తక్షణమే నెగోషియేషన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, కేటీపీపీ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిని, భూసేకరణ వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. ప్రాజెక్టు అమలులో భూములు కోల్పోతున్న ప్రభావిత రైతుల సమస్యలను సానుభూతితో పరిశీలించి, వారికి చట్టబద్ధంగా అందాల్సిన న్యాయమైన పరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. భూసేకరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాలని, రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాల మేరకు సమస్యల పరిష్కారానికి నెగోషియేషన్ కమిటీ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, సర్వే రికార్డులను పక్కాగా సిద్ధం చేసుకోవాలని, ఎక్కడా లోపాలు తలెత్తకుండా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే ఏడీ కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, కేటీపీపీ సీఈ శ్రీప్రకాష్, ఎస్ఈ ముత్యాల రావు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

భూపాలపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ. భూ వివాదాలకు సంబంధించిన రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి సమగ్ర నివేదికలు అందజేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రెవెన్యూ మరియు అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాలను సంయుక్త సర్వేల ద్వారా త్వరితగతిన తేల్చాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు భూపాలపల్లి, గణపురం, వీణవంక, రేగొండ, చిట్యాల, టేకుమాట్ల, మొగుళ్లపల్లి మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



నిజామాబాద్ నుండి కదిలిన గోటి తలంబ్రాలు

- రామకోటి రామరాజుకు తలంబ్రాలు అందజేసిన భక్తులు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 25 : భద్రాచల రామయ్య కళ్యానానికి నిజామాబాద్ జిల్లా కేంద్రం కోట గల్లి హనుమాన్ దేవాలయం నుంచి గోటి తలంబ్రాలు కదిలాయి. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఈ సంవత్సరం 300కిలోల గోటి తలంబ్రాలు అందించాలన్న సంకల్ప దీక్షతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రామనామ స్మరణ చేయించి గోటి తలంబ్రాలు సిద్ధం చేపిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నిజామాబాద్, వివిధ గ్రామాల నుండి వచ్చిన గోటి తలంబ్రాలను రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ భక్తితో ప్రతి భక్తుడు మేము భద్రాచలం వెళ్లలేక పోయిన తాము ఓలిచిన తలంబ్రాలు రామయ్య కళ్యాణనికి చేరడం ఎన్నో జన్మల పుణ్యమో అన్నారు.

గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్



ప్రతిపక్షం, పరకాల, మార్చి 25: గంజాయి అక్రమ రవాణా కేసులో గత కొంతకాలంగా పరారీలో ఉన్న నిందితుడిని ఆత్మకూరు పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్.హెచ్.ఓ తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది డిసెంబర్ 22న నమోదైన ఎన్.డి.పి.ఎస్ కేసులో పెద్దాపూర్ గ్రామానికి చెందిన వంశీకృష్ణను పోలీసులు అప్పట్లోనే అరెస్ట్ చేయగా, కీర్తినగర్‌కు చెందిన మహమ్మద్ హనీఫ్ పరారీలో ఉన్నాడు. కాగా, నిందితుడు హనీఫ్ తన న్యాయవాదిని కలిసేందుకు పరకాల వైపు వెళ్తున్నాడన్న నమ్మదగిన సమాచారంతో పోలీసులు గూడెప్పాడ్ సెంటర్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.



కౌన్సిలర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రతిపక్షం,పరకాల, మార్చి 25: పరకాల పట్టణ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి సామాజిక బాధ్యతతో మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చే సదుద్దేశంతో పట్టణంలోని కూరగాయల మార్కెట్ గల్లీలో తన సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వేసవి కాలంలో పరకాల మరియు పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా నేటి నుండి వేసవి ముగిసే వరకు ప్రతిరోజూ కూల్ వాటర్ క్యాన్ల ద్వారా ప్రజలకు చల్లటి తాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల ఆదరాభిమానాలు, భగవంతుని కృపతో ప్రజా ఉపయోగ పనులను చేయడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆయన వెల్లడించారు. తనపై నమ్మకంతో రెండోసారి కౌన్సిలర్‌గా గెలిపించిన 9వ వార్డు ప్రజలందరికీ ఈ సందర్భంగా ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై శిక్షణ

- బీఎల్ఓల గైర్హాజరుపై కలెక్టర్ ఆగ్రహం



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 25: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై బూత్ లెవెల్ అధికారులకు బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో శిక్షణ నిర్వహించారు. అయితే, శిక్షణ కార్యక్రమానికి పలువురు బీ.ఎల్.ఓలు హాజరు కాకపోవడాన్ని గమనించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎంతో కీలకమైన శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరు కావడాన్ని తీవ్రంగా పరిగణించారు. గైర్హాజర్ అయిన బీ.ఎల్.ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బాధ్యులపై తప్పనిసరిగా కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తరహా నిర్లక్ష్యం కారణంగానే ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉందని, బీ.ఎల్.ఓలు శిక్షణకు గైర్హాజరు అయితే మీరేం చేస్తున్నారంటూ సూపర్వైజర్లపై కూడా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకపోతే మూకుమ్మడి సస్పెన్షన్లకు కూడా వెనుకాడేది లేదని బీ.ఎల్.ఓలుగా వ్యవహరిస్తున్న మెప్మా ఆర్.పీలు, అంగన్వాడీ సిబ్బంది, వార్డు ఆఫీసర్లకు స్పష్టమైన హెచ్చరికలు చేశారు. కాగా, బీ.ఎల్.ఓలు నిర్వర్తించవలసిన విధులు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలు, ఎన్యుమరేషన్ ఫారం నింపాల్సిన విధానం, క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన ధృవీకరణ పత్రాలు తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు జ్ఞానేశ్వర్, సంతోష్ కుమార్ లు అవగాహన కల్పించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ రవీంద్ర సాగర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సౌత్, నార్త్ తహసిల్దార్లు శ్రీధర్, విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎస్‌జీ కెప్టెన్ పంత్ టెస్టుల్లాగే టీ20ల్లోనూ తన ఆటకు సంబంధించి ఓ బ్లూ ప్రింట్ రెడీ చేసుకోవాలి. టీ20ల్లో మెరుగ్గా ఎలా ఆడాలో పంత్ ఒక గేమ్ ప్లాన్ కనుక్కోవాలి. ప్రతి బాల్ గురించి ముందుగానే ఆలోచించొద్దు. తొలి 6 బంతులు ఆయన ఎలా ఆడతారనేదే ముఖ్యం. నంబర్స్ పరంగా ఆయన ఇంకా హై ఇంపాక్ట్ చూపించాలని కోరుకుంటున్నా.

- మాజీ క్రికెటర్ డుప్లెసిస్

మాక్ డ్రిల్‌తో ప్రజలకు అవగాహన

- కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్



ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 25: ప్రకృతి విపత్తుల సమయం లో తీసుకోవలసిన జాగ్రత్తలపై నిర్వహించిన ముందస్తు మాక్ డ్రిల్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యవేక్షించారు. కామారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువులో బుధవారం ముందస్తు వరద సహాయక చర్యల పై సమగ్ర మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) సమన్వయంతో, జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ (డీడీఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమం వరద పరిస్థితుల్లో రక్షణ చర్యలు, శాఖల మధ్య సమన్వయం, స్పందన సామర్థ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా , మాక్ డ్రిల్ లో వరదలో చిక్కుకున్న బాధితులను రక్షించే విధానాలను ప్రదర్శిస్తూ రెస్క్యూ బోట్లు, లైఫ్ జాకెట్లు, తాళ్ల సహాయంతో రక్షణ వంటి పద్ధతులను చూపించారు. మొత్తం 12 శాఖలు అగ్నిమాపక, పోలీస్, వైద్య, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర విభాగాలు చురుకుగా పాల్గొన్నాయి. మొత్తం 187 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తు సమయంలో సమన్వయం, తక్షణ స్పందన, ప్రజల అవగాహన అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, అధికారుల సూచనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను, ఆస్తులను రక్షించుకోవచ్చని సూచించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణ రక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఇటువంటి మాక్ డ్రిల్‌ల ద్వారా ప్రజలకు , అధికారులకు విపత్తు సమయంలో ఎలా స్పందించాలో స్పష్టమైన అవగాహన కలుగుతుందని తెలిపారు. అలాగే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు వేగవంతంగా స్పందించి ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి, విపత్తుల సమయం లో ఎలా ఎదుర్కోవాలో ముందుగానే అవగాహన కలిగివుండి అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ఈ మాక్ డ్రిల్ లో అదనపు కలెక్టర్ విక్టర్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, డిప్యూటీ కమాండర్ డోల్ సింగ్, జిల్లా అగ్నిమాపక అధికారి సుధాకర్, ఆర్డీవో వీణ, తహసిల్దార్ హిమబిందు వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంపుల ద్వారా బాలికల సంరక్షణ

- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 25: ఆర్ బి ఎస్ కె హెల్త్ క్యాంపుల ద్వారా బాలికల సంరక్షణ చేపట్టడం జరుగుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం లో కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆర్ బి ఎస్ కే హెల్త్ క్యాంప్ ను ఆమె పరిశీలించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రత్యేక ప్రణాళికను ప్రతిమ సింగ్ పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే అల్పాహారం భోజన సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించి విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆమె సూచించారు. బియ్యం పప్పు దినుసులు ఇతరత్రా వస్తువులను కూరగాయల నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పై హాస్టల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యల పై అవగాహన కల్పిస్తూ హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ శివదయాల్ పాల్గొని ఆరోగ్య సమస్యలపై మాట్లాడారు. ఈ క్యాంపులో 216 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.



వడ్డే కాలనీలో అంగన్వాడీ బాల మేళా

ప్రతిపక్షం సిద్దిపేట టౌన్, మార్చి25: వడ్డే కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో ఈరోజు బాల మేళ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డి డబ్ల్యూ ఓ శారద మాట్లాడుతూ, బాల మేళను పిల్లల మధ్య పోటీగా కాకుండా అందరూ కలిసి ఆనందంగా జరుపుకునే పండుగగా అభివర్ణించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ పిల్లలు ఏడాది పొడవునా నేర్చుకున్న పాఠాలను, ఆటలు, పాటలు, కథల రూపంలో తమ తల్లిదండ్రుల ముందుంచారు. చిన్నారులకు అక్షరజ్ఞానం అందించేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో వినూత్న పద్ధతులు అనుసరిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా, ఆటపాటల ద్వారా పిల్లలకు విద్యను బోధిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ ఆలకుంట కవిత, సి ఆర్ పి స్వేత, సూపర్వైజర్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు టీ. వినోద, బి. భాగ్యలక్ష్మి, హమీద, పర్వీన్, శబరీతో పాటు ఆయాలు పాల్గొన్నారు.



తొగుట పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం!

ప్రతిపక్షం, తొగుట, మార్చ్ 25: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా తొగుట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ రాధా కిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత శిబిరంలో స్పెషలిస్ట్ విభాగాల వారీగా జనరల్ ఫిజీషియన్ 86, చిన్నపిల్లల వైద్య నిపుణులు 6, దంత వైద్య నిపుణులు 9, ఎముకలు సంబంధిత నిపుణులు 20 , గైనకాలజీ 75 మొత్తంగా 220 మంది ప్రజలు స్పెషలిస్టుల వైద్య సేవలను వినియోగించుకున్నారు అలాగే 23 మందికి రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ప్రభుత్వం మెడికల్ కాలేజ్ నుండి విచ్చేసిన స్పెషలిస్ట్ వైద్యులు మరియు స్థానిక వైద్యాధికారి రాధా కిషన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..



మెగా హెల్త్ క్యాంపు.. విశేష స్పందన

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 25: దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, పాలకవర్గం సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి క్యాంపును ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ స్వయంగా రక్త పరీక్షలు చేయించుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వైద్య బృందం గ్రామస్తులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పీహెచ్సి వైద్యధికారి దివ్య, పాలకవర్గం సభ్యులు, వైద్య సిబ్బంది తో కలిసి ఉచితంగా అందజేశారు. అలాగే వివిధ వ్యాధుల నివారణ, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ హెల్త్ క్యాంపు ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, స్వామి, పద్మనాభునిపల్లి సర్పంచ్ వేముల అరుణ రాజేశం, తిమ్మాపూర్ ఉపసర్పంచ్లు వన్నెల విజయ్ కుమార్, రుద్రారం యాదగిరి, వార్డ్ మెంబర్లు మండల కనకయ్య,మహిళలు, యువత పీహెచ్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్ పనులను పరిశీలించిన అదనపు ఎస్పీ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 25: మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) పెట్రోల్ బంక్ నిర్మాణ పనుల పురోగతిని జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు.బుధవారం మెదక్ పట్టణంలోని ఆవుసులపల్లి పరిధిలో నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంక్ పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. అవసరమైన మౌలిక సదుపాయాలను సక్రమంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనపు ఎస్పి వెంట ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్,ఆర్ఎస్ఐ మహిపాల్ తదితర సిబ్బంది తదితరులు ఉన్నారు.



శ్రీ విద్య పాఠశాల విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

- గురుకుల ప్రవేశ పరీక్షలో 14మంది అర్హత

ప్రతిపక్షం,మెదక్ టౌన్, మార్చి 25: తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్షలో పాపన్నపేట శ్రీ విద్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు.పాఠశాల నుంచి మొత్తం 15 మంది విద్యార్థులు ఫిబ్రవరి 22న నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు హాజరుకాగా, తాజాగా ప్రకటించిన ఫలితాల్లో 14 మంది విద్యార్థులు 5వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించారు.ఒక్క విద్యార్థి తప్ప మిగిలిన అందరూ ఉత్తీర్ణత సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్థులను విజయపథంలో నడిపించిన ఉపాధ్యాయులు దుర్గ, సునీత, అనురాధ, షీలా, విలాస్, జ్యోతిరాజ్ ప్రధాన్‌లను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ప్రిన్సిపాల్ రవీందర్ గుప్తా, కరస్పాండెంట్లు నిటలాక్షప్ప, సుమన్‌లు కూడా విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ప్రతి సంవత్సరం గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఇలాంటి ఫలితాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.ఇలాంటి విజయాలు విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు.



నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 25: జిల్లాలో రేషన్ దుకాణాలకు సక్రమంగా,నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. బుధవారం మెదక్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రేషన్ షాపులకు బియ్యం సరఫరాను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అక్కడి స్టాక్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్, గూడ్స్ రిజిస్టర్ రికార్డులతో పాటు ఆన్‌లైన్ నమోదులను, వెయింగ్ యంత్రాల రసీదులను పరిశీలించారు. మూడు నెలల బియ్యం సరఫరా పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జగదీష్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు తదితర అధికారులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 25: చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మరణించిన సంఘటన వెల్దుర్తి మండలం అందుగులపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దుర్తి మండలం అందుగులపల్లి పల్లి గ్రామానికి చెందిన గోపాల్ (40) చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వల లో చిక్కుకొని నీట మునిగి మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో గజ ఈతగాళ్ల సహాయంతో గోపాల్ శవాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు.



బాలల ఊహలకు రెక్కలు సాహిత్యంతో సాధ్యం

- రచనలతోనే విద్యార్థుల ప్రతిభ వికాసం
- మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ (ఏసీజీ) ఆదేపు కరుణాకర్
- హవేలి ఘణపూర్‌లో బాలసాహిత్య కార్యశాల నిర్వహణ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 25: బాలలు చిన్న వయస్సులోనే సృజనాత్మక రచనలపై దృష్టి సారించాలని మెదక్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ (ఏసీజీ) ఆదేపు కరుణాకర్ సూచించారు. బాలసాహిత్యం ద్వారా పిల్లలలో ఊహాశక్తి, ఆలోచనా శక్తి పెంపొందుతుందని తెలిపారు.తెలంగాణ సారస్వత పరిషత్, హైదరాబాద్ మరియు శాంతా వసంతా ట్రస్ట్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,హవేలి ఘణపూర్‌లో సృజనాత్మక బాలసాహిత్య కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. బాలసాహిత్యం పిల్లలను ప్రకృతి, జంతువులతో అనుసంధానిస్తూ వారి భావ వ్యక్తీకరణకు దోహదపడుతుందని చెప్పారు. మండల విద్యాధికారి మధుమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని మహనీయుల జీవిత చరిత్రలను చదవాలని, వాటి ద్వారా మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్ శాశ్వత సభ్యులు గరిపల్లి అశోక్ మాట్లాడుతూ.. జిల్లాలో అనేక పాఠశాలల్లో బాల సాహిత్య సృజన కొనసాగుతోందని, విద్యార్థులు వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తూ తమ ప్రతిభను చాటుకోవాలని అన్నారు. యంజేపి ప్రిన్సిపాల్ సృజన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో రచనలు చేస్తూ మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యశాలలో రచయితలు ఉండ్రాళ్ళ రాజేశం,గిర్ని అంజాగౌడ్, ఎండి ఉస్మాన్, నల్ల అశోక్, బుర్ర సంతోష్, ఎల్లమ్మలు విద్యార్థులకు కథల రచనపై శిక్షణ అందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, చల్ల రవీందర్, దేవులా, శ్రీలత,సరిత,కనకరాజు, మధు మోహన్, ప్రతిభ, పర్శరాములు, ఛాత్రోపాధ్యాయులు ప్రభాకర్, సుభాష్, భరత్, సమీన్, మౌనిక, సంధ్య, మరియు హవేలి ఘణపూర్, బూర్గుపల్లి, రాజ్‌పల్లి, ఎంజేపీ హవేలి ఘణపూర్ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కొరత లేదు

- భయాందోళనలతో కొనుగోలు చేయవద్దు
- జిల్లా పౌర సరఫరాల అధికారి తనూజ



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 25: సిద్దిపేట జిల్లాలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ (LPG) కొరత లేదని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి తనూజ వెల్లడించింది. ఆయిల్ రిఫైనరీల నుంచి స్థానిక డిపోల వరకు ఇంధన సరఫరా యంత్రాంగం సక్రమంగా పనిచేస్తోందని అధికారులు తెలిపారు. ప్రజల రోజువారీ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని పెట్రోల్ బంకుల వద్ద కనిపిస్తున్న పొడవైన క్యూలు, “No Stock” బోర్డులు వాస్తవ కొరత కారణంగా కాకుండా, వదంతులతో భయాందోళనకు గురైన ప్రజలు అధికంగా ఇంధనం కొనుగోలు చేయడం వల్లనే వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కారణంగా సాధారణం కంటే 2.5 నుంచి 3 రెట్లు అమ్మకాలు పెరిగినట్లు తెలిపారు.పెట్రోల్ లేదా డీజిల్‌ను డబ్బాలు, క్యాన్లలో నిల్వ చేయడం పిఈఎస్ఓ నిబంధనలకు విరుద్ధమని, ఇది అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. అక్రమ నిల్వలు లేదా బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఓఎంసి ల అడ్వాన్స్ పేమెంట్ విధానాల్లో మార్పుల వల్ల కొంతమంది డీలర్లకు తాత్కాలిక ఇబ్బందులు ఎదురైనా, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పెట్రోలియం సంస్థలు, పోలీస్ శాఖలు కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.అవసరమైనంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని, వదంతులను నమ్మకూడదని, అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని అధికారులు సూచించారు.



పశ్చిమ బెంగాల్ ముస్లింలకు సీఎం మమతా బెనర్జీ ఏమీ చేయలేదు. ఆమె రాజకీయాలే రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు దోహదపడ్డాయి. ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారు. ముస్లిం నాయకత్వం లేని రాష్ట్రాల్లో వారి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. హుమాయున్ ఏజేయూ పార్టీతో కలిసి బెంగాల్‌లో ముస్లింల రాజకీయ నాయకత్వ బలోపేతానికి కృషి చేస్తాం.

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ



బాలమేళా వల్ల పిల్లలలో సృజనాత్మకత పెరుగుతుంది

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 25: అంగన్వాడీ కేంద్రాల్లో గల విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి బాలమేళా లాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అక్కెనపల్లి గ్రామ సర్పంచ్ పోతరాజు రేణుక రమేష్ అన్నారు. బుధవారం నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బాలమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు పలువురు చిన్నారులు వారు నేర్చుకున్న ఆటలు పాటలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లల్లో నైపుణ్యత పెరిగి బడి వాతావరణం అలవాటు అవుతుందని అన్నారు. పిల్లలతో పాటు బాలింతలు, గర్భవతులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపడానికి ప్రాధాన్యత ఇవ్వాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ రజిత, రిలయన్స్ ఫౌండేషన్ సీఆర్పీ మౌనిక, ఉపసర్పంచ్ అఖిల కృష్ణ, అంగన్వాడీ టీచర్లు లింగవ్వ, పద్మ, వసుమతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేయాలి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 25: సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న వెయ్యి పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు.బుధవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన, ఆసుపత్రి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిగా నిలిచిపోయాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆసుపత్రి నిర్మాణం సుమారు 90 శాతం పూర్తయిందని, మిగిలిన పనులు పూర్తి చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు.గత రెండున్నరేళ్లుగా ఆసుపత్రి పనులు అంగుళం కూడా ముందుకు కదలలేదని, ఈ విషయాన్ని ప్రతి అసెంబ్లీ సమావేశంలో పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు.మెడికల్ కాలేజీకి అనుబంధంగా నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల పనులు కూడా 8090 శాతం పూర్తయ్యాయని, ప్రస్తుతం కిరాయి భవనంలో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి ఆసుపత్రి, నర్సింగ్ కళాశాలను ప్రజలు మరియు విద్యార్థులకు ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



సిబ్బందిపై పనిభారం తగ్గించకపోతే సమ్మె తప్పదు

- మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాల్వ చక్రధర్

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 25 : ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది రాత్రింబవళ్లు విధుల్లో నిమగ్నమై ఉన్నారని కావున వారి న్యాయపరమైన డిమాండ్లను వెంటనే తీర్చాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కాల్వ చక్రధర్ డిమాండ్ చేశారు. బుధవారం నాడు స్థానిక విలేకరులతో కాల్వ చక్రధర్ మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం రోజువారీ విధుల్లో 60 శాతం సమయం ఆన్లైన్, ఆఫ్ లైన్ పనులకే సరిపోతోందని, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత వల్ల పనిభారం పెరిగి సిబ్బంది శారీరకంగా, మానసికంగా కృంగిపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆశా కార్యకర్తలు సమ్మెలో ఉన్న సమయంలో, కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే కోసం క్షేత్రస్థాయి సిబ్బందిని ఇంటింటికి వెళ్ళమనడం అసమంజసమని ఆయన మండిపడ్డారు. కుకునూరు పల్లి, దౌల్తాబాద్, అక్కన్నపేట, కొండపాక పీహెచ్‌సీల్లోని సమస్యలను త్వరలోనే జిల్లా కలెక్టర్ మరియు డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నాడు ప్రకటించిన పీఆర్సీ ని అమలు చేయాలి అని మరియు డీఏ బకాయిలను విడుదల లాంటి న్యాయమైన కోర్కెలు తీర్చని పక్షంలో ఏప్రిల్ నెలలో జిల్లా వ్యాప్త ధర్నాలు నిర్వహిస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె నోటీసు ఇచ్చి వైద్య సేవలను నిలిపివేస్తామని చక్రధర్ హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాండవుల కుమారస్వామి, కాసుల రవీందర్ రెడ్డి, బి. శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి భూంపల్లి రాజు, గౌరవాధ్యక్షులు చెరుకు భాస్కర్, ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాల్వ శోభ, గజ్వేల్ డివిజన్ నాయకులు ఆదిమూలం నారాయణ, దేవసాని వాసుదేవ్, మంగ, మరియు పారామెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.



భద్రాచల శ్రీరామ కల్యాణ గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 25: భద్రాచల దేవస్థానంలో ఈనెల 27జరిగే సీతారాముల కల్యాణ గోడ పత్రికలు, కరపత్రాలను శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నాడు గజ్వేల్ ఏసీపీ నర్సింలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాముల కల్యానానికి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరిచే గోటి తలంబ్రాలు ఓలిపించి భద్రాచలం అందించడంలో రామకోటి రామరాజు చూపించిన కృషి, పట్టుదల అమోఘం అన్నారు. భద్రాచలం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో రామకోటికి చోటు కల్పించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడిచినప్పుడే లోక శాంతి ఉంటుందని ఏసిపి తెలిపారు.



వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన కుమారులకు పోలీసుల కౌన్సిలింగ్

ప్రతిపక్షం బ్యూరో సిద్దిపేట, మార్చి 25: వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణపై వచ్చిన ఫిర్యాదుకు సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు స్పందించారు. త్రీ టౌన్ పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన పాముకుంటా నర్సయ్య-ఎల్లవ్వ దంపతులు తమ ముగ్గురు కుమారులకు ఆస్తులను సమానంగా పంచినప్పటికీ, తగిన పోషణ అందడం లేదని ఈ నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదుపై స్పందించిన త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ టాటా లక్ష్మీబాబు బుధవారం కుమారులు యాదగిరి, కిష్టయ్య, దేవయ్యలతో పాటు వారి భార్యలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ ప్రతి కుమారుడి ప్రాథమిక బాధ్యత అని, వారిని నిర్లక్ష్యం చేయడం నైతికంగానే కాకుండా చట్టపరంగాను తప్పు అని హెచ్చరించారు. తల్లిదండ్రులు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ, వృద్ధాప్యంలో వారికి అవసరమైన ఆర్థిక, ఆరోగ్య సహాయాన్ని అందించాలని సూచించారు. కౌన్సిలింగ్ అనంతరం కుమారులు తమ తల్లిదండ్రులను ఇకపై సక్రమంగా చూసుకుంటామని, ప్రతి నెల ఖర్చులకు డబ్బులు అందిస్తామని, ఆరోగ్య సమస్యల సమయంలో కలిసి వైద్య సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మి పెరుమాళ్ మార్గదర్శకత్వంలో వృద్ధుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ఫిర్యాదులు వస్తే కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాన్ని సందర్శించి వృద్ధ దంపతుల పరిస్థితిని పరిశీలిస్తామని ఇన్స్పెక్టర్ వెల్లడించారు.పోలీసుల జోక్యంతో కుటుంబ వివాదం సఖ్యతగా పరిష్కారమవడంతో నర్సయ్య-ఎల్లవ్వ దంపతులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లకు అవకాశం కల్పించాలి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు బట్టు దయానంద రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 25: మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లకు అవకాశం కల్పించాలి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు బట్టు దయానంద రెడ్డి బుధవారం నాడు స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం, స్థానిక సంస్థలు ముందడుగు వేయాలని ఇందులో భాగంగా ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు కూడా ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉండి, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడానికి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం ఇవ్వడం అవసరమని తెలిపారు. ఈ నిర్ణయం తీసుకుంటే సమానత్వం, సామాజిక న్యాయం బలపడటమే కాకుండా ఇతర మున్సిపాలిటీలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ శివలింగ కృష్ణ. సిపిఐ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.




రైతు సంక్షేమం నిరంతరం కృషి చేస్తాం

- బుగ్గ రాజేశ్వర ఎఫ్.పి.ఓ చైర్మన్ కుంబాల నగేష్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 25: సాగులో నూతన పద్ధతుల పై అవగాహన కల్పిస్తూ రైతు సంక్షేమం కోసం కృషి చేస్తానని బుగ్గ రాజేశ్వర రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘం చైర్మన్ కుంబాల నగేష్ రెడ్డి అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎఫ్.పీ.ఓ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చూస్తామన్నారు. ఎఫ్.పీ.ఓ ద్వారా విత్తనోత్పత్తి చేసి నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ప్రణాళిక చేస్తామన్నారు. ఎఫ్. పీ.ఓ ద్వారా రైతులకు హర్వెస్టర్, వడ్లు ఆరబెట్టే యంత్రం, గడ్డి కట్టలు కట్టే యంత్రం, స్ప్రేయర్ వంటి సౌకర్యాలు సభ్యులకు అందేలా చూస్తామని చెప్పారు. సంఘం లావాదేవీలు ఎప్పటికప్పుడు ప్రతి సభ్యునికి తెలిసేలా చేస్తామని హామి ఇచ్చారు. ఎఫ్.పీ.ఓ సేవలు అన్ని గ్రామాలకు అందించడం పాటు ప్రతి నెలా ఒక్కో గ్రామంలో సమావేశం నిర్వహించి సంఘం పరిధిని మరింత విస్తృతం చేస్తామని, ఎలాంటి అవినీతికి తావివ్వకుండా సభ్యులందరికీ జవాబుదారిగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు అజయ్ రెడ్డి,పెద్ది బిక్షపతి, పుర్ర రాజయ్య, బాలాపోచయ్య, సుతారి వెంకట్ , బాల్ రెడ్డి, మహంకాళి బిక్షపతి, శ్రీనివాస్, దేవి రెడ్డి, కొంగరి నారాయణ, భూంరెడ్డి, రాంచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇంధన కొరత లేదు

- తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు
- పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 25: జిల్లాలో పెట్రోల్,డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో సరఫరా ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు అనవసర ఆందోళనకు గురై ఒకేసారి బంకులకు చేరుకోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు సాధారణ పంపిణీకి అంతరాయం కలుగుతుందని సిపి తెలిపారు.సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి వాహనదారులు తమ వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపుకోవడానికి లేదా అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని సిపి సూచించారు. ఇలా చేయడం వల్ల ఇతరులకు అనవసరమైన అసౌకర్యం కలుగుతుందని, సాధారణ అవసరాల మేరకే ఇంధనాన్ని వినియోగించుకోవాలని కోరారు. నిర్ధారించని సమాచారాన్ని ఇతరులకు షేర్ చేయడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉందని తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే, వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.



వాలిడేషన్ యాక్ట్ రద్దు చేయాలి

- పెన్షనర్ల నిరసన

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 25: తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో పెన్షనర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి బ్లాక్ డే పాటిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పెన్షనర్లు మానసికంగా కృంగిపోతూ, ఆందోళన చెందుతున్నారని జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జైన సత్యం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 25032025న తీసుకొచ్చిన వాలిడేషన్ యాక్ట్‌కు వ్యతిరేకంగా ఈ కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రధాన మంత్రికి మెమోరాండం పంపించాలని నిర్ణయించి, జిల్లా కలెక్టర్ ద్వారా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పరిపాలనాధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు ప్రభుత్వానికి, ప్రజలకు విశేష సేవలు అందించిన ఉద్యోగులకు పెన్షన్ ఒక హక్కుగా లభిస్తుందని, అయితే వాలిడేషన్ యాక్ట్ కారణంగా ఇకపై పెన్షన్ పెరుగుదల లేకుండా చేయడం అన్యాయమని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఈ యాక్ట్‌ను రద్దు చేసి, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు మనశాంతి, భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు స్వర్గం రాజేశం, జానకిరాములు, గోపాల్, రాఘవరెడ్డి, మండల బాధ్యులు ఎల్లారెడ్డి, గోపాల్ రెడ్డి, లక్ష్మయ్య, రాజిరెడ్డి, మల్లారెడ్డి, జ్ఞానేశ్వర్, తిరుపతి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులపై సుత్తితో దాడి

- 5 తులాల బంగారం దోపిడీ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 23 : శంకరంపేట్ (ఆర్) పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగరాయి గ్రామంలో మధ్యాహ్న సమయంలో దోపిడి ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి వృద్ధ దంపతులు అంజయ్య, సావిత్రి నివాసంలోకి ప్రవేశించి సుత్తితో దాడి చేసి, వారి వద్ద ఉన్న సుమారు 5 తులాల బంగారు ఆభరణాలను దోచుకుని బైక్‌పై పరారయ్యాడు. దాడిలో గాయపడిన దంపతులను స్థానికులు వెంటనే మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ, నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు. డియస్పి తూప్రాన్ నరేందర్ గౌడ్, సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్సై నారాయణ గౌడ్, ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జ్యోతిర్లింగ దివ్య దర్శనం పూర్వజన్మ సుకృతం

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 25: పూజ్య గురుదేవులు రవిశంకర్ ఆశీస్సులతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించబడుతున్న జీవన కళ 1000+ సంవత్సరాల సోమనాథ్ జ్యోతిర్లింగ దివ్య దర్శనం చేసుకునే అవకాశాన్ని గజ్వేల్ ప్రాంత ప్రజలకి కలిగించడం పూర్వజన్మ సుకృతమని గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ ప్రతాపరెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి లు అన్నారు. ఓంకార నాదం నిర్వచనాన్ని విడమరచి చెప్పిన గురూజీకి శుభాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపాల్ ఛైర్పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నరసరావు, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ మరియు గజ్వేల్ పాలక వర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది.



ఇందిరా గాంధీ ఉక్కుమహిళ, ఆమె అంటే మాకు గౌరవమే. నేను తప్పేమీ మాట్లాడలేదు. అనేక పథకాలకు ఇందిరమ్మ పేరు పెట్టారు. ఇప్ప సారా తయారుచేస్తే ఆమె పేరు మాత్రం పెట్టొద్దనే చెప్పా. తమాషా చేయొద్దని మంత్రి నన్ను బెదిరిస్తున్నారా?' నేనేం తప్పు మాట్లాడానో రికార్డులు పరిశీలించండి. అవసరమైతే హౌస్ కమిటీ వేయండి. క్షమాపణ చెప్పాల్సి వస్తే చెబుతా.

- బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి

'యూటర్న్ ఉస్తాద్' ప్రధాని మోడీ

- మహిళ రిజర్వేషన్ల అంశంలో ప్రధాని తీరుపై కాంగ్రెస్ విమర్శలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 25: ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై ఆయన తీసుకున్న తాజా నిర్ణయాన్ని 'యూటర్న్ ఉస్తాద్' అంటూ ఎద్దేవా చేసింది. జనగణన, డిలిమిటేషన్ పూర్తి కాకుండానే మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రయత్నించడం అనేది పూర్తిగా యూటర్న్ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అని విమర్శించారు. ప్రభుత్వ విదేశాంగ వైఫల్యాలు, ఎల్‌పీజీ, ఇంధన సంక్షోభం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇది ఆయుధంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల స్థానాలను 50 శాతం పెంచే యోచనపై చర్చించాల్సిన అవసరం ఉందని తెలిపారు. '2023లో పార్లమెంట్ ఆమోదించిన చట్టం ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కేటాయింపుల్లో కూడా మహిళలకు మూడొంతులు రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, ఈ రిజర్వేషన్లు డెలిమిటేషన్, జనగణన పూర్తి అయిన తర్వాత మాత్రమే అమల్లోకి రావాల్సి ఉంది. అయితే ఈ చట్టంపై చర్చ జరిగినప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల నుంచే అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కానీ, డెలిమిటేషన్, జనగణన పూర్తయ్యాకే ఇది సాధ్యమని మోదీ ప్రభుత్వం అప్పట్లో స్పష్టం చేసింది. కానీ 30 నెలల తర్వాత ప్రధాని తన అభిప్రాయన్ని మార్చుకుని డెలిమిటేషన్, జనగణన పూర్తికాకుండానే రిజర్వేషన్ అమలు చేయాలని చూస్తున్నారు' అని జైరాం రమేశ్ విమర్శించారు.



విశ్వ వీక్షణం



దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు

- ఉడాన్ స్కీం కింద కేంద్రం గ్రీన్ సిగ్నల్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 25: ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు దేశంలో 100 కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మిండానికి కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా ఎయిర్‌పోర్టులతోపాటు, హెలిపోర్టులు, వాటర్ ఏరోడ్రోమ్స్‌ను కూడా కేంద్రం నిర్మించనుంది. 2026-27 నుంచి 2035-36 వరకు, పదేళ్లపాటు ఉడాన్ స్కీమ్ కింద వీటిని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం రూ.28,840 కోట్లను కేంద్రం కేటాయించనుంది. దీని ద్వారా చిన్న పట్టణాలకు ప్రాంతీయ ఎయిర్ కనెక్టివిటీ పెరుగుతుందని కేంద్రం చెబుతోంది. ఏవియేషన్ నెట్‌వర్క్‌ను విస్తరించడం, ప్రాంతీయ రవాణా వ్యవస్థ బలోపేతం, ఆర్థిక రంగానికి ఊతమివ్వడం వంటి లక్ష్యాలతో కేంద్రం కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టనుంది. ఇప్పటివరకు ఎయిర్ కనెక్టివిటీ లేని టైర్ 2 పట్టణాల నుంచి టైర్ 3 పట్టణాల వరకు, హిల్ స్టేషన్లు, సరిహద్దు ప్రాంతాలు, ఐలాండ్స్ ఇలా మొత్తంగా 100 ఎయిర్‌పోర్టులు వంటివి నిర్మిస్తారు. అలాగే, ఎయిర్‌పోర్టులు నిర్మించడానికి వీలుకాని ప్రదేశాల్లో 200 ప్రత్యేక హెలిప్యాడ్లు, వాటర్ ఏరోడ్రోమ్స్ వంటివి కూడా నిర్మితమవుతాయి. అలాగే 441 ఏరోడ్రోమ్‌ల నిర్మాణంతోపాటు నిర్వహణ ఖర్చుల కోసం మరో రూ.2,577 కోట్లను కూడా కేంద్రం కేటాయించనుంది. మరోవైపు ఇప్పటికే నిర్మితమై ప్రయాణికుల డిమాండ్ తక్కువగా ఉన్న చోట కూడా ఇకపై సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయి. వాటిని రద్దు చేయరు.



పార్టీ ఆఫీస్ ఖాళీ చేయండి..


- కాంగ్రెస్‌కు కేంద్రం నోటీసులు


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 25 : దేశ రాజధాని ఢిల్లీ 24, అక్బర్ రోడ్‌లో ఉన్న కాంగ్రెస్ కార్యాలయాన్ని శనివారం లోగా ఖాళీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆ పార్టీని ఆదేశించింది. ఈ బంగ్లా 48 ఏండ్లుగా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంగా కొనసాగుతున్నది. కేంద్రం ఆదేశాలు రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉంది. గత ఏడాది కాంగ్రెస్ పార్టీ కోట్ల మార్గ్‌లోని ఇందిరా భవన్‌లో కొత్త హెడ్‌క్వార్టర్స్‌ను ప్రారంభించడంతో కార్యాలయం అక్కడికి తరలిపోయింది. అయితే అక్బర్ రోడ్‌లోని కార్యాలయాన్ని ఆ పార్టీ ఖాళీ చేయలేదు. అక్కడ ఇంకా పార్టీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ బంగ్లాల్లో పార్టీ కార్యకలాపాలు కొనసాగించరాదని కేంద్రం గతంలో ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా పార్టీలు సొంత కార్యాలయాలు నిర్మించుకున్నాయి.



వందేమాతరం గీతంపై దాఖలైన పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 25: దేశంలో నిర్వహించే అన్ని అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పటిషన్‌ను విచారణ చేయడానికి సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం పాడడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయలేదని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పాంచోలీల త్రిసభ్య ధర్మాసనం ఈ పటిషన్‌ను పరిశీలించింది. మహమ్మద్ సయీద్ నూరి దాఖలు చేసిన పిటిషన్ ప్రీమెచ్యూర్‌గా, వివక్ష ఎదుర్కోవాల్సి వస్తుందనే అనవసర ఆందోళన ఆధారంగా వేసినట్లు అభిప్రాయపడింది. పిటిషనర్ నూరి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, తాము దేశంలోని అన్ని మతాలను గౌరవిస్తామని అన్నారు. కానీ మతం, విశ్వాసంతో సంబంధం లేకుండా ప్రజలందరూ జాతీయ గేయం పాడాలని బలవంతం చేయకూడదని పేర్కొన్నారు. ఒక వేళ అలా బలవంతం చేస్తే అది దేశంపై విశ్వాసం చూపించాలని బలవంతం చేసినట్లు అవుతుందని అన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ బాగ్చీ, జాతీయ గేయం పాడనందుకు ఎవరికైనా శిక్ష పడిందా? లేదా వందేమాతరం పాడనందుకు ఎవరినైనా అధికారిక సభల నుంచి బయటకు పంపేశారా? కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్‌లో అలాంటి అంశాలు ఏమైనా ఉన్నాయా? అని పిటిషనర్‌ను ప్రశ్నించారు. దీనికి 'వందేమాతరం గేయం పాడినప్పుడు అంతరాయం కలిగిస్తే జరిమానా ఉంటుంది' అని హెగ్డే పేర్కొన్నారు. నిజానికి పాడనివారిపై లీగల్‌గా ఎలాంటి చర్యలు తీసుకోనప్పటికీ, జరిమానాలు వేయడం వల్ల, పాడడానికి, లేదా నిలబడడానికి నిరాకరించే వారిపై ఎప్పుడూ ఆర్థిక భారం పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఇలా ప్రజలను జాతీయ గేయం పాడమని బలవంతం చేయవచ్చా? అని ఆయన తిరిగి ప్రశ్నించారు. దీనితో హెగ్డేను ఉద్దేశించి, 'జాతీయ గేయం పాడమని బలవంతం చేస్తూ పిటిషనర్‌కు ఎవరైనా నోటీసు పంపారా?' అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశంలోని 5వ నిబంధన 'మే' (may) అని చెబుతోంది. అంటే జాతీయ గేయమైన వందేమాతరాన్ని పాడడం లేదా పాడకపోవడం అనే విషయంలో అందరికీ స్వేచ్ఛ ఉంది. కనుక ఇది చట్టపరమైన హక్కులకు విరుద్ధం కాదు" అని జస్టిస్ బాగ్చీ అన్నారు. అయితే పిటిషనర్‌కు ఏదైనా నోటీసు లేదా శిక్ష పడే పరిస్థితి ఎదురైనప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతానికి పిటిషనర్ మహమ్మద్ సయీద్ నూరి వివక్షకు గురవుతామనే అనవసరపు ఆందోళనతో వేసిన పిటిషన్ తప్ప మరేమీ కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.





మన దేశంలో 40% మందిలో ఫ్యాటీ లివర్ సమస్య!



డా. కౌశల్ గోవర్ధన
ఏం.బి.బి.ఎస్, (ఎం.డి, ఇంటర్నల్ మెడిసిన్)
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదారాబాద్
7702417779

నిజామా ! తక్కువ మోతాదులో మద్యం (ఆల్కహాల్) తాగితే 'ఫ్యాటీ లివర్' సమస్య రాదా..?

దేశంలో కాలేయ సంబంధిత వ్యాధులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. మెడికల్ లాన్సెట్ (ఆగ్నేయాసియా) జర్నల్లో ప్రచురితమైన ఫెనోమ్ ఇండియా అధ్యయనం ప్రకారం.. దేశవ్యాప్తంగా 2023 డిసెంబర్ నుంచి 2024 జూన్ మధ్య 27 నగరాల్లో జరిపిన పరిశోధనలో సుమారు 38.9 శాతం మందిలో ఆల్కహాల్తో సంబంధం లేని మెటబాలిక్ డిస్ఫంక్షన్‌అసోసియేటెడ్ స్టీటోటిక్ లివర్ డిసీజ్ (ఎంఏఎస్ఎల్డీ) ఉన్నట్లు తేలింది. కాలేయం గట్టిపడటం లేదా మచ్చలు పడటం (ఫైబ్రోసిస్) ముప్పు సాధారణ వ్యక్తుల్లో 1.7% మందిలో ఉంది. ఇప్పటికే ఎంఏఎస్ఎల్డీ సమస్య ఉన్నవారిలో లివర్ ఫైబ్రోసిస్ 6.3 శాతం మందిలో.. అంటే దాదాపు 4 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. మొత్తంగా 2.4 శాతం మందిలో ఫైబ్రోసిస్ లక్షణాలు కనిపించాయి.

సైలెంట్ కిల్లర్..

గతంలో నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ పిలిచే ఈ సమస్యను ఇప్పుడు ఎంఏఎస్ఎల్డీగా పిలుస్తున్నారు....

భారత దేశంలో 'ఫ్యాటీ లివర్'

చాపకింద నీరులా సైలెంట్ గా పెరుగుతుంది. కనీసం 20 ఏళ్ల యువతలో కూడా కాలేయం చెడిపోతుంది. దీనికి కారణం 'నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్' (NAFLD). భారతదేశంలో ఇది ఒక నిశ్శబ్ద హంతకినీలా (Silent Killer) వస్తుంది... తప్పుడు ఆహారపు అలవాట్లు మనల్ని ఈ ఫ్యాటీ లివర్ మహమ్మారి బారిన పడేటట్లు చేస్తుంది. మనం తీసుకునే జంక్ ఫుడ్, మైదా, పంచదార అధికంగా ఉండే కూల్ డ్రింక్స్ నేరుగా లివర్ కి కొవ్వుగా మారుతున్నాయి. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చోవడం, శారీరక శ్రమ లేకపోవడం వల్ల శరీరంలోని క్యాలరీలు ఖర్చు కాక కాలేయంలో నిల్వ ఉంటున్నాయి. పొట్ట చుట్టూ కొవ్వు ఉన్నవారికి 'ఫ్యాటీ లివర్' వచ్చే అవకాశం 90 శాతం ఎక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. అలాగే టైప్ 2 డయాబెటిస్ ఉన్న రోగుల్లో కాలేయం త్వరగా విషతుల్యంగా మారుతోంది... 'నాన్‌ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్' (NAFLD), తాజా గణాంకాల ప్రకారం, భారత జనాభాలో దాదాపు 30% నుంచి 35% మంది ఈసమస్యతో బాధపడుతున్నారు. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరి లివర్ లో కొవ్వు పేరుకుపోయింది. అత్యంత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే.. కాలేయం 80 శాతం దెబ్బతినే వరకు ఎలాంటి నొప్పి గానీ, బయటకు కనిపించే లక్షణాలు గానీ ఉండవు. అలసట, కడుపు పై భాగంలో అసౌకర్యం వంటి సాధారణ లక్షణాలే ఉండటంతో చాలామంది దీనిని పట్టించుకోరు. చివరికి అది లివర్ సిర్రోసిస్, క్యాన్సర్ గా మారినప్పుడు మాత్రమే అసలు విషయం బయటపడుతుంది. జీవక్రియల తేడా కారణంగా వచ్చే వ్యాధులు (మెటబాలిక్ సిండ్రోమ్స్), స్థూలకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ వంటి కారణాల వల్ల ఈ ఫ్యాటీలివర్ సమస్య వస్తుంది.

లక్షణాలు

అధిక బరువు..

ఈ సమస్యతో బాధపడే వారు ఊహించని విధంగా బరువు పెరుగుతారు. ముఖ్యంగా పొట్ట చుట్టూ కొలత పెరగడం ఫ్యాటీ లివర్ సమస్యకు ఒక కారణం కావచ్చు. పొట్ట చుట్టూ అధికంగా కొవ్వు పేరుకుపోవడం అంతర్లీనంగా ఉన్న కాలేయ సమస్యలను కూడా సూచిస్తుంది. రక్తంలో పెరిగిన చక్కెరలు ఫ్యాటీ లివర్ సమస్యను కూడా సూచిస్తాయని చెప్పవచ్చు. ఫ్యాటీ లివర్ జీవక్రియలను దెబ్బతీయడంతో పాటు కాలేయ పనితీరు మందగించేలా చేస్తుంది. దీంతో ఇన్సులిన్ నిరోధకత పెరిగి రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కనుక రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగితే కాలేయ పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం కూడా మంచిది. మనకు అలసట రావడం సహజమే. కానీ విశ్రాంతి తీసుకున్నప్పటికీ అలసట రావడం, ఎప్పుడూ నీరసంగా ఉండడం కూడా ఫ్యాటీ లివర్ కి ఒక సంకేతమే.

చర్మం, కళ్ల రంగు మారటం..

ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో చర్మం, కళ్లు పసుపు రంగులోకి మారిపోతాయి. కామెర్లు రావడాన్ని తీవ్రమైన ఫ్యాటీ లివర్ సమస్యగా భావించాలి. ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్య సహాయం తీసుకోవాలి. ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడే వారిలో పొత్తికడుపు పైభాగంలో కుడివైపు నొప్పిగా ఉంటుంది. వాపు కారణంగా కాలేయ పరిమాణం పెరుగుతుంది. దీంతో కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఫ్యాటీ లివర్ సాధారణంగా శరీరంలో కొవ్వు స్థాయిలు ఎక్కువగా ఉండడాన్ని సూచిస్తుంది. అధిక కొలెస్ట్రాల్ కారణంగా కాలేయ పనితీరు తగ్గడంతో పాటు గుండె సంబంధిత జబ్బులు వచ్చే అవకాశం కూడా ఉంది. ఫ్యాటీ లివర్ సమస్య తీవ్రమై సిర్రోసిస్‌గా మారే అవకాశంఉంటుంది. ఈ పరిస్థితి మరీ తీవ్రమైతే లివర్ ట్రాన్స్‌ప్లాంట్ కూడా అవసరం కావచ్చు. అయితే, ఈ వ్యాధిని ముందుగా గుర్తిస్తే దానిని నివారించవచ్చు లేదా పరిస్థితిని మెరుగుపరచవచ్చు.

ఇదే కాక ఆల్కహాల్ తీసుకునే వారు..

ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ (AFLD):

ఆల్కహాలిక్ స్టీటోహెపటైటిస్ అని కూడా పిలువబడే ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీస్ అనేది, ఆల్కహాల్ అధికంగా తీసుకోవడం వల్ల (మగవారిలో 40 గ్రా, ఆడవారిలో 20 గ్రా మద్యపానం వల్ల) కలిగే జీవక్రియ ప్రభావాల ఫలితంగా వస్తుంది.

తక్కువ ఆల్కహాల్ (మద్యం) తీసుకున్న వారికి కూడా కాలేయ కణాలు దెబ్బతింటాయి.

గతంలో కాలేయం (లివర్) దెబ్బతిన్నదంటే.. ఆల్కహాల్‌తో ఫ్యాటీలివర్ ముప్పు ఉందన్న విషయం తెలిసిందే. అయితే నిత్యం బాగా తాగేవారిలోనే ఈ ఫ్యాటీ లివర్ ముప్పు ఎక్కువ అనే అపోహ గతంలో ఉండేది. తాజాగా, అనేక అధ్యయనాల ప్రకారం ఎప్పుడో ఒకసారి (అకేషనల్) తాగేవారికీ కూడా ఫ్యాటీలివర్ ముప్పు తప్పదని తెలుస్తోంది. దీనికి తోడు మగవాళ్లకు దీటుగా తాము ఆల్కహాలు ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్న మహిళల్లో ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంటుందని అధ్యయనాల ద్వారా తెలుస్తుంది. సోషల్ డ్రింకింగ్, వీకెండ్ కాక్టెయిల్ పార్టీస్ అంటూనో లేదా ఇంట్లోనైనా ఎప్పుడో ఒకసారి అంటూ తాగేవారికి సైతం ఫ్యాటీలివర్ ముప్పు తప్పదు. చాలామందిలో ఓ అపోహ ఉంది. అదేమిటంటే... చాలా కొద్దిమోతాదులో అంటే ప్రతిరోజూ 30 మి.లీ.కు మించకుండా ఆల్కహాల్ తీసుకుంటే... అందులోనూ రెడ్ వైన్ తీసుకునేవారిలో గుండెజబ్బులు రావని, రక్తనాళాల్లోని కొవ్వు కొట్టుకపోతుందనీ, అంత తక్కువ మోతాదులో ఆల్కహాల్ తీసుకుంటే అది ఫ్యాటీలివర్ కి దారితీయదనీ...ఇలాంటి అపోహలు చాలా మందిలో ఉన్నాయి. అవన్నీ వాస్తవం కాదు అని అధ్యయనాల్లో తేలింది...

స్పైడర్ ఆంజియోమాస్

మీ చర్మంపై చిన్న ఎరుపు రంగు మచ్చలు కనిపించడాన్ని స్పైడర్ ఆంజియోమాస్ అంటారు. ఇవి సాలీడు ఆకారంలో, మధ్యలో ఎర్రటి చుక్క ఉండి చుట్టూ కాళ్ల లాంటి రక్తనాళాల విస్తరణతో ఉంటాయి అందుకే దీనిని స్పైడర్ ఆంజియోమాస్ అంటారు. ఇవి తరచుగా కాలేయ వ్యాధులు, గర్భధారణ, లేదా హార్మోన్ల మార్పుల వల్ల ఏర్పడతాయి. మీ ముఖం, మెడ లేదా ఛాతీపై స్పైడర్ ఆంజియోమాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

నిర్ధారణ

బాధితుల స్థూలకాయం, పొట్ట (సెంట్రల్ ఒబేసిటీ) చూసి వైద్యులు పరిస్థితిని కొంత కనుకోగలరు. కొన్ని రక్తపరీక్షలుతో పాటు డయాబెటిస్, కొలెస్ట్రాల్ మోతాదులు, ట్రైగ్లిజరైడ్ స్థాయిలు పెరిగాయా అన్నది చూడాలి. అల్ట్రా సౌండ్ స్కానింగ్లో ఫ్యాటీలివర్ కండిషన్ బయటపడుతుంది. కొందరిలో లివర్ బయాప్సీ (అంటే కాలేయం తాలూకు చిన్న ముక్కను సేకరించి చేసే) పరీక్ష అవసరం. లివర్ బయాప్సీతో ఎన్ఏఎఫ్ఎల్డీలో అది నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ (ఎన్ఏఎఎఫ్ఎల్) కండిషనా, లేక నాన్ ఆల్కహాలిక్ స్టియటోహెపాటిక్ (నాశ్) కండిషనా అన్నది నిర్ధారణ చేయవచ్చు.

ముఖ్య జాగ్రత్తలు ..

మలం, మారిన మూత్రం రంగు కాలేయ అనారోగ్యాన్ని సూచిస్తాయి. బైలిరుబిన్ వల్ల మూత్రం ముదురు రంగులో వస్తుంది. లేత రంగు మలం పిత్త లోపాన్ని సూచిస్తుంది. కాలేయ పనితీరు మందగించడం వల్ల ఇలా జరుగుతుంది. కనుక ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సహాయం తీసుకోవడం అవసరం.

నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్' రాకుండా కొన్ని జాగ్రత్తలు..

సైలెంట్ కిల్లర్ అయిన ఫ్యాటీ లివర్ను ప్రారంభదశలో గుర్తిస్తే సులభంగా రివర్స్ (మళ్ళీ సాధారణ స్థితికి తీసుకరావడం) చేయవచ్చు. దీనికోసం ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలి. మీ బరువులో కేవలం 7-10 శాతం తగ్గినా కాలేయంలోని కొవ్వు కరిగిపోతుంది.

- అన్నం, రోటీ వంటి కార్బోహైడ్రేట్లు తగ్గించి.. ప్రోటీన్లు, ఆకుకూరలు, పీచు పదార్థాలు పెంచాలి.
- రోజుకు 30 నిమిషాల వేగవంతమైన నడక, ఏరోబిక్ వ్యాయామం కాలేయానికి ప్రాణవాయువు లాంటివి.
- ప్యాక్ చేసిన జ్యూస్లు, స్వీట్లు, సోడాలకు పూర్తిగా దూరంగా ఉండాలి.
- మీ వ్యక్తిగత వైద్యుల సలహా లేకుండా పెయిన్ కిల్లర్స్ అధికంగా వాడకూడదు, అవి కాలేయంపై ప్రభావం

తినకూడని ఆహారాలు పదార్థాలు

- చక్కెర: స్వీట్లు, కూల్ డ్రింక్స్, ప్యాక్ చేసిన జ్యూస్లు పూర్తిగా మానేయాలి.
- మైదా: బిస్కెట్స్, వైట్ బ్రెడ్, పిజ్జా వంటివి కాలేయానికి శత్రువులు.
- అధిక ఉప్పు: రక్తపోటును పెంచి కాలేయంపై ఒత్తిడి కలిగిస్తుంది.
- వేపుళ్లు (Fried Foods): నూనెలో వేయించిన పదార్థాలు కొవ్వును పెంచుతాయి.

ఫైబ్రోస్కాన్ పరీక్ష ఎందుకు?

- కాలేయ జబ్బు చికిత్సను అంచనా వేయొచ్చు
- కాలేయం మీద ఏర్పడిన మచ్చలు లేదా ఫైబ్రోసిస్‌ను కనిపెట్టవచ్చు, కాలేయంలోని కొవ్వుల్లో మార్పులను పసిగట్టవచ్చు
- ఫైబ్రోస్కాన్ ఎవరికి చేస్తారు? ఐదేళ్లకు మించి క్రమం తప్పకుండా మద్యం తీసుకునేవారు , ఒబెసిటీ మరియు దీర్ఘకాలిక లివర్ జబ్బులు ఉన్నవారికి

ముఖ్య సూచిక.. ఈ ఫైబ్రోస్కాన్ అనే పరీక్ష

ధనుంజయ హాస్పిటల్ లో, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో (నాలుగు వెల రూపాయల ఖరీదైన పరీక్షను) ప్రతి నెల మూడవ శుక్రవారం ఉచితంగా పరీక్షలు చేయబడును.





సిరీస్ సౌతాఫ్రికాదే!

న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను దక్షిణాఫ్రికా 32తో సొంతం చేసుకొంది. బుధవారం జరిగిన ఆఖరి, ఐదో టీ20లో దక్షిణాఫ్రికా 33 పరుగులతో గెలిచింది. తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 187/4 స్కోరు చేసింది. కానర్ ఎస్టర్‌హుజెన్ (75) అర్ధ శతకంతో అదరగొట్టగా.. హెర్మన్ (35), ముల్డర్ (31) రాణించారు. ఛేదనలో కివీస్ ఓవర్లన్నీ ఆడి 154/8 స్కోరుకే పరిమితమైంది. జాకబ్స్ (36), రాబిన్సన్ (25) టాప్ స్కోరర్లు. కొట్జీ, ముల్డర్, బార్ట్‌మన్ తలో 2 వికెట్లు దక్కించుకొన్నారు.



రాజస్థాన్ రాయల్స్ విక్రయం

షేన్ వార్న్ కుటుంబానికి రూ. 460 కోట్లు

ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్‌ను విక్రయిస్తే.. ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం, దివంగత షేన్ వార్న్ కుటుంబానికి దాదాపు రూ. 460 కోట్ల జాక్‌పాట్ తగిలింది. వార్న్ ముందు చూపు వల్లే ఇదంతా జరిగిందనే టాక్ నడుస్తోంది. రాజస్థాన్‌ను అమెరికా టెక్ వ్యాపారవేత్త కల్ సోమానీ కన్సార్టియం రూ. 15,300 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఇందులో వార్న్‌కు 3 శాతం వాటా ఉంది. 2008లో రాయల్స్ ఫ్రాంచైజీ కెప్టెన్, మెంటార్, క్రికెట్ కార్యకలాపాల పర్యవేక్షకుడిగా వార్న్‌ను ఫ్రాంచైజీ నియమించుకొంది. ఆ సమయంలో అతడు ఓ సూపర్ డీల్ కుదుర్చుకున్నాడు. తన ఫీజుతోపాటు తానాడిన ప్రతి ఏడాదికి 0.75 శాతం వాటా ఇవ్వాలనే ఒప్పందం చేసుకొన్నాడు. వార్న్ నాలుగు సీజన్లపాటు రాజస్థాన్ తరఫున ఆడడంతో.. అది మొత్తం 3 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో వార్న్ కుటుంబం ఆ వాటాను విక్రయిస్తే రూ. 450 నుంచి 460 కోట్ల వరకు దక్కించుకొనే అవకాశం ఉంది. అయితే, ఈ ఒప్పందానికి బీసీసీఐ ఆమోదం తీసుకోవాలి. షేన్ వార్న్ 2022లో గుండెపోటుతో మరణించాడు.



'ఇంపాక్ట్ ప్లేయర్' పై ఐపీఎల్ కెప్టెన్ల అభ్యంతరం

ఐపీఎల్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను తీసుకొచ్చినప్పటి నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం జరిగిన ఐపీఎల్ సారథుల సమావేశంలో కూడా మెజార్టీ కెప్టెన్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను బీసీసీఐ 2023లో ప్రవేశపెట్టింది. అనంతరం ఈ రూల్‌ను 2027 వరకు పొడిగించింది. అయితే, తాజాగా జరిగిన సమావేశంలో కూడా 10 జట్ల సారథులు ఈ రూల్‌పై మరోసారి సుదీర్ఘంగా చర్చించారు. 'ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై కెప్టెన్లు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలియజేశారు. అయితే, 2027 ఎడిషన్ వరకు ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదని స్పష్టం చేశాం' అని ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. కాగా, తొలి ఇన్నింగ్స్‌లో 10 ఓవర్ల తర్వాత మరో కొత్త బంతిని ఇచ్చే అవకాశాలను పరిశీలించాలని ఓ జట్టు సారథి కోరాడట. మంచు ప్రభావం తగ్గించేందుకు రెండో ఇన్నింగ్స్‌లో 10 ఓవర్ల తర్వాత బంతి మార్చే అవకాశం ప్రస్తుతం ఉంది. ఇక, ప్రాక్టీస్ మార్గదర్శకాలపై మరింత స్పష్టత ఇవ్వాలని సన్‌రైజర్స్ తాత్కాలిక కెప్టెన్ ఇషాన్ కిషన్ అడిగాడని తెలిసింది. కొత్త నిబంధన ప్రకారం మ్యాచ్ రోజు ప్రాక్టీస్‌కు అనుమతి లేదు.



ఆర్సీబీ కొత్త ఛైర్మన్‌గా ఆర్యమాన్ బిర్లా

ఐపీఎల్‌లో అత్యంత ఫ్యానిజం కలిగిన జట్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒకటి. లీగ్ ఆరంభం నుంచి ఆర్సీబీ నడిపిస్తున్న యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యుఎస్ఎస్) సంస్థ.. ఏకంగా రూ.16,706 కోట్ల ధరకు ఆర్సీబీని అమ్మేసింది. ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ ఇండియా, బోల్ట్ వెంచర్స్, బీఎక్స్‌పీ ఈ బ్లాక్‌స్టోన్ సంస్థలు కలిసి ఈ ఫ్రాంచైజీని దక్కించుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ డీల్ తర్వాత ఆర్సీబీకి ఆర్యమాన్ బిర్లా కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. మరి ఎవరీ ఆర్యమాన్ బిర్లా.. ఈయన బ్యాగ్రౌండ్ ఏంటనే దానిపై అభిమానులు చర్చించుకుంటున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆదిత్య బిర్లా గ్రూప్ అధినేత కుమార మంగళం బిర్లా కుమారుడే ఈ ఆర్యమాన్ బిర్లా. 28 ఏళ్ల ఆర్యమాన్ ఒకప్పుడు క్రికెటర్‌గా కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకున్నాడు. దేశవాళీల్లో మధ్యప్రదేశ్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడిన అతడు.. 9 మ్యాచుల్లో 414 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ కూడా ఉంది. 2018 ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీ ఆర్యమాన్‌ను రూ.30 లక్షల బేస్ ప్రైజ్‌తో కొనుగోలు చేసింది. అయితే అతడికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. తరువాత 2020 సీజన్‌కు ముందు ఆర్ఆర్ ఆర్యమాన్‌ను రిలీజ్ చేసింది. ఆ తర్వాత డొమెస్టిక్‌లోనూ, ఐపీఎల్‌లోనూ అవకాశాలు రాలేదు. దీంతో కెరీర్ మధ్యలోనే తీవ్రమైన ఒత్తిడి కారణంగా క్రికెట్‌కు విరామం ప్రకటించాడు. ఆర్యమాన్ ప్రస్తుతం ఆదిత్య బిర్లా మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడు.



సాయిపల్లవి.. 'ఒక రోజు'

నటి సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఒక గుడ్ న్యూస్ వచ్చింది. ఆమె నటించిన తొలి హిందీ చిత్రం 'ఏక్ దిన్' ఇప్పుడు తెలుగులో 'ఒక రోజు' పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా రాబోతున్న ఈ సినిమాను అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. జపాన్ మంచు కొండల నేపథ్యంలో సాగే ఈ సుందరమైన ప్రేమకథలో సాయిపల్లవి తన సహజ సిద్ధమైన నటనతో మరోసారి మాయ చేయబోతున్నట్లు సమాచారం. ట్రైలర్ చూస్తుంటే.. కేవలం ఒకే ఒక్క రోజులో జరిగిన పరిణామాలు ఇద్దరు వ్యక్తుల జీవితాలను ఎలా మార్చాయనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ నుంచి వస్తున్న సినిమా కావడం, దానికి తోడు సాయిపల్లవి లాంటి ప్రతిభావంతురాలైన నటి ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ విభిన్నమైన ప్రేమకథను మే 1వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.



27న 'పెద్ది' మాస్ ర్యాంపేజ్

రామ్‌చరణ్ రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' నిర్మాణం నుంచే భారీ హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన చికిరి చికిరి, రైరై రారా పాటలు ఛార్ట్‌బస్టర్స్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా గురించి బిగ్ అప్‌డేట్ ను అందించారు. ఈ నెల 27న రామ్‌చరణ్ పుట్టినరోజుని పురస్కరించుకొని మాస్ ర్యాంపేజ్ పేరుతో గ్లింప్స్‌ని విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు.


రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం: 'పెద్ది' చిత్రీకరణలో రామ్‌చరణ్ స్వల్పంగా గాయపడ్డారు. ఆయన ఎడమ కంటి దగ్గర చిన్న గాయమైందని మేకర్స్ తెలిపారు. 'రామ్‌చరణ్ పూర్తిగా క్షేమంగా ఉన్నారు. షూటింగ్ షెడ్యూల్‌కు ఎలాంటి అంతరాయం లేదు. ఆయన యథావిధిగా తిరిగి షూటింగ్‌లో పాల్గొంటారు' అని మేకర్స్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.



అంచనాలను పెంచిన 'రాకాస' ట్రైలర్

ఏప్రిల్ 3న రిలీజ్ మూవీ గ్రాండ్ రిలీజ్

నిహారిక.. జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమా ఏప్రిల్ 3న రిలీజ్ అవుతోంది. ఇప్పటి వరకు విడుదల చేసిన టీజర్, సాంగ్స్‌తో సినిమాపై ఆసక్తి పెరిగింది. డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో మూవీపై బజ్ క్రియేట్ అయ్యింది. ఈ క్రమంలో మేకర్స్ బుధవారం రోజున ట్రైలర్‌ను విడుదల చేశారు. లేటెస్ట్‌గా విడుదలైన ఈ ట్రైలర్ సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్‌ను మరింతగా పెంచాయి. 'ఆ కోటలో ఉన్నది.. ఊరు బలి పంపుతున్నది సామాన్యుడికి కాదు.. భీకర బ్రహ్మ రాక్షసుడికి' అనే డైలాగ్‌తో 'రాకాస' ట్రైలర్ ప్రారంభమవుతుంది. దానికి అనుగుణంగా చూపించే పురాతనమైన కోట.. బ్రహ్మ రాక్షసుడు ఇవన్నీ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. భయంతో నడుస్తున్న గెటప్ శీను ఓ పిల్లాడు చేసిన బూర సౌండ్‌కి జడుసుకుంటాడు. వెంటనే 'నువ్వు పెద్ద డీఎస్‌పి అనుకుంటున్నావా? లోపలకిపో..కోతి నాయాలా!' అని తిడతాడు. హీరో సంగీత్ శోభన్, నయన సారికల మధ్య ఉన్న ప్రేమ.. హీరో, హీరోయిన్‌కు మధ్య ఉన్న సీన్స్‌ను చూపిస్తూ వారి మధ్య ఉన్న లవ్ యాంగిల్‌ను రివీల్ చేశారు. బస్సులో సంగీత్, తనికెళ్ల భరణి, గెటప్ శీను మధ్య వచ్చే కామెడీ సీన్ ఆకట్టుకుంటోంది. పోలీస్ ఆఫీసర్ సంగీత్‌ను ఉద్దేశించి 'రాత్రి ఏం జరిగింది?' అని అడిగితే..'పడుకోవడం లేటయ్యింది' అని కామెడీగా సమాధానమిస్తాడు. 'వేళాకోళంగా ఉందా? నా హిస్టరీ నీకు తెలియదు' అని బ్రహ్మాజీ సంగీత్‌తో అంటే.. 'ఏం డిలీట్ చేస్తారా?' అని ఇచ్చే ఫన్నీ కౌంటర్ ఆకట్టుకుంటోంది. 'ఊరుకొచ్చినప్పటి నుంచి నా జీవితం ఎటేలుతుందో తెలియటం లేదు' అని హీరో టెన్షన్ పడటం దానికి తోడు ట్రైలర్లో చూపించే ఉల్క పతనం..రాత్రికి రాత్రి పశువులు కలేబరాలుగా మారటం చూస్తే ఊర్లో ఏదో జరుగుతుందనే క్యూరియాసిటీ క్రియేట్ అవుతుంది. ఊరు బతికి బయటపడాలంటే బలి పంపాల్సిందే అంటూ తనికెళ్లభరణి చెప్పటం..కోటకు సంబంధించిన తాళాన్ని చూపించటం చూస్తే కోటకు, ఊరుకి మధ్య ఏదో లింకు ఉందనేది అర్థమవుతుంది. ట్రైలర్ చివరలో 'ఈమాత్రం దానికేనా.. లోపల నీకుంటది అసలైన మ్యూజిక్ అనటంతో..' బ్రహ్మ రాక్షసుడు ఉండే కోటలోకి హీరో సంగీత్ ఎంట్రీ ఉంటుంది.. ఆ కోటలోకి వెళ్లిన హీరో ఏం చేశాడు? ఊరిని కాపాడాడా? తన ప్రేమను గెలిపించుకున్నాడా? అనే విషయాలు తెలియాలంటే మాత్రం ఏప్రిల్ 3న రిలీజ్ కానున్న రాకాస సినిమా చూడాల్సిందేనని ఆసక్తి రెట్టింపు అయ్యింది.



తమిళ దర్శకుడితో...

కొంతకాలంగా భారీ విజయం కోసం ఎదురుచూస్తున్నారు హీరో రామ్ పోతినేని. గత ఏడాది 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో తన తదుపరి సినిమాపై రామ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. ఈసారి పక్కా హిట్ కొట్టాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారట. తాజా సమాచారం ప్రకారం... అగ్ర దర్శకుడు లోకేష్ కనకరాజ్ శిష్యుడు లోగీ విఘ్నేష్‌తో రామ్ ఓ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ను చేయబోతున్నారని తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, రామ్ కెరీర్‌లోనే భారీ వ్యయంతో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. ఓ అగ్ర నిర్మాణ సంస్థ రూపొందించబోతున్న ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన త్వరలో వెలువడుతుందని తెలిసింది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200